ప్రజాశక్తి


మంగళవారం 9 ఏప్రిల్ 2024 8 పేజీలు


గుంటూరు


పల్నాడు

పోస్టల్ బ్యాలెట్‌లపై పార్టీల దృష్టి!

5 నుంచి 8 వరకు ఎన్నికల సిబ్బందికి ఓటువేసే అవకాశం



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది వినియోగించే పోస్టల్ బ్యాలెట్‌లపై రాజకీయపార్టీలు దృష్టి సారిస్తున్నాయి. ఉద్యోగులను అకట్టుకునేందుకు ప్రధాన రాజకీయపార్టీల అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఎవరెవరు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటారో వారివివరాలు సేకరిస్తున్నారు. వీరిని స్వయంగా కలిసి తమకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. పోలింగ్ తేదీ నాడు ఎన్నికల విధుల్లో ఉండే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌లను వినిగించుకునే అవకాశం ఉంది. దాదాపు 25 వేల మంది వరకు జిల్లాలో ఉద్యోగులు, అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొనడం వల్ల వీరి ఓట్లను తమకు అనుకూలంగా పడేలా చూసుకోవడానికి రాజకీయ పార్టీలు దృష్టిసారించాయి. గత ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్‌ను సరిగా లెక్కించకపోవడం వల్లే తాము ఓడిపోయామని వైసిపి అభ్యర్థులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం అన్నారు. మోదుగుల వేణుగోపాలరెడ్డి న్యాయస్థానంను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో ఈసారి అభ్యర్థులుతగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు,అధికారులకు మేనెల 5 నుంచి 8వ తేదీవరకు కేటగిరి వారీగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గుంటూరులోని కొన్ని కళాశాలల్లో ఇందుకోసం పరిశీలిస్తున్నారు. తొలిరోజు పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, మైక్రోఅబ్జర్వర్లు, 6వ తేదీన అదర్ పోలింగ్ అధికారులు, 7వ తేదీన పోలీసులు, ఇతర ఉద్యోగులు, 8వ తేదీన ఇతర జిల్లాలకు చెందిన వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని ఎన్నికలకమిషన్ సూచించింది. గుంటూరు లోక్‌సభ పరిధిలో 1884 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో కొన్ని కేంద్రాల్లో 1300 కంటే ఎక్కువ ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలు 31 వరకు ఉన్నట్టు జిల్లా అధికారులు గుర్తించారు. ఈ మేరకు 31 కేంద్రాలు అదనంగా ఏర్పాటుకు ఎన్నికల కమిషన్‌కు జిల్లా అధికారులు ఇటీవల ప్రతిపాదనలు పంపారు. ఎన్నికల కమిషన్ అనుమతిస్తే జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 1915కి పెరిగే అవకాశం ఉంది. ఒక్కోకేంద్రంలో ఆరుగురు సిబ్బందితోపాటు 20 శాతం రిజర్వు సిబ్బందితో కలిపి మొత్తం 13900 మంది సిబ్బంది అవసరం అవుతారని అంచనా వేశారు. వీరిలో పాటు ఇతర అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, పోలీసులు, వైద్య

▶ 2లో



పల్నాడులో వైసిపి అధినేత జగన్ రోడ్ షో

ప్రజాశక్తి - వినుకొండ

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైసిపి అధినేత, సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సుయాత్రకు పల్నాడు జిల్లాలోని వినుకొండలో సోమవారం కొనసాగింది. గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి నుండి చీకటిగలపాలెం గ్రామం మీదగా సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన బస్సు యాత్ర రెండుగంటలకుపైగా కొనసాగింది. బస్సులో నుండే ప్రజలకు జగన్ అభివాదం చేస్తూ యాత్ర కొనసాగించారు. చింతలచెరువు వద్ద పల్నాడు జిల్లాలోకి ప్రవేశించిన సిఎం బస్సుపైన నర్సరావుపేట పార్లమెంటు అభ్యర్థి అనిల్‌కుమార్ కూడా ఉన్నారు. వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో వైసిపి కార్యకర్తలు సిఎంకు ఎదురువెళ్లి ఘన స్వాగతం పలికారు. అక్కడ నుండి కొనసాగిన బస్సుయాత్రలో సీఎం పక్కన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కూర్చుని రోడ్ షో కొనసాగించారు. రోడ్డుకి

▶ 2లో

సిపిఎం మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా జొన్నా శివశంకరరావు

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే స్థానానికి 'ఇండియా' ఫోరం పార్టీలైన కాంగ్రెస్ పార్టీ, సిపిఐ, ఆమ్ ఆద్మీ బలపరిచిన సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు పోటీ చేస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం రాత్రి ప్రకటించారు. 1955 అక్టోబర్ 4న పేద రైతు కుటుంబంలో జన్మించిన జొన్నా శివశంకరరావు ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నారు. విద్యార్థిగా ఉన్నప్పుడే భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)లో నాయకులుగా, ప్రజానాట్యమండలి కళాకారుడిగా, యువజన సంఘం నాయకునిగా, సిపిఎం సభ్యుడిగా 1980 నుండి పనిచేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర సహాయ కార్యదర్శి, పసుపు రైతు రాష్ట్ర సంఘం కన్వీనర్‌గా పనిచేసే అనేక ఉద్యమాలను నడిపారు. పోరాట సమయంలో ఆరు నెలల పాటు రహస్య జీవితం, మూడు నెలలపాటు జైలు జీవితం గడిపారు. 1981 నుండి 2001 వరకు ఉండవల్లి సర్పంచ్‌గా 20 ఏళ్లపాటు పనిచేశారు. సిపిఎం ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా, తాడేపల్లి డివిజన్ కార్యదర్శిగా పనిచేశారు. పేదల ఇళ్ల స్థలాల కోసం ఉద్యమించి 6 వేల మందికి ఇళ్ల స్థలాలు సాధించి ఇల్లు కట్టించడంలో కీలకపాత్ర పోషించారు. విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా పోరాడారు. నిత్యావసరాల ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా, రైతు సమస్యలపై నిత్యం

▶ 2లో

ఇండియా వేదిక అభ్యర్థుల్ని గెలిపించాలి

ప్రజాశక్తి-గుంటూరు



విలేకర్లతో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు

ఇండియా ఫోరం తరపున గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, గుంటూరు తూర్పు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ మస్తాన్‌వలిని వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు కె.నళినీకాంత్, కె.మల్యాద్రి కోరారు. సోమవారం స్థానిక బ్రాడీపేటలోని సిపిఎం కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. దేశంలో నరేంద్రమోడీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో పెద్దపెద్ద కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతూ ఊడిగం చేసిందని, రైతు, కార్మికుల సమస్యలను విస్మరించిందని అన్నారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలు తెచ్చి వందలమంది రైతుల చావుకు కారణమైందన్నారు. ప్రతిపక్ష పార్టీలపై ఈడి, సిబిఐ దాడులు నిర్వహిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తుందని విమర్శించారు. దేశంలో మూలుగుతున్న నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రజల ఖాతాల్లో రూ.15 లక్షల చొప్పున జమ చేస్తామని చెప్పిన మోడీ ఒక్క రూపాయి కూడా జమ చేయలేదన్నారు. ప్రజలపై పన్నుల భారం మోపడం, దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెట్టడమే లక్ష్యంగా బిజెపి

▶ 2లో

కిడ్నాప్ కేసులో మరొకరికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

వైద్య విద్యార్థినిని కిడ్నాప్ చేసి తండ్రి నుంచి డబ్బు గుంజాలని చూసిన గ్యాంగ్‌లో ఒకడైన కంకిపాడు మండలం ఉప్పులూరుకు చెందిన మంద రవికి జీవిత ఖైదు విధిస్తూ గుంటూరు నాలుగవ అదనపు జిల్లా జడ్జి రుద్రపాటి శరత్‌బాబు సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. విజయవాడ సూర్యారావుపేటలో ఇఎన్‌టి హాస్పిటల్ నడుపుతున్న ఓ డాక్టర్ కుమార్తె ఎన్నారై మెడికల్ కళాశాలలో చదువుతున్నారు. ఆమె ప్రతిరోజూ కళాశాలకు కారులో వచ్చి వెళ్లేవారు. ఈ కారుకు పిన్నెబోయన ప్రసాద్ అనే వ్యక్తి డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఈయన తన స్నేహితులైన మంద రవి, ఉయ్యూరు ఆలీ, పరిమి నాగరాజు, రాణి మేకల వెంకన్నతో కలిసి తమ యజమాని కుమార్తెను కిడ్నాప్ చేసి డబ్బు వసూలు చేయాలని పథకం రచించాడు. 2017 జూన్ 8న సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి తిరిగి వెళ్లేందుకు ఆమె కారులో ఎక్కి కూర్చున్నారు. కారును

▶ 2లో



సాగర్ కుడి కాల్వకు తాగునీటి విడుదల



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం సాయంత్రం) : 6.27

సహరీ (బుధవారం ఉదయం) : 4.40

రసవత్తరం.. సందేశాత్మకం

కొనసాగుతున్న జాతీయస్థాయి నాటకోత్సవాలు

ప్రజాశక్తి - యడ్లపాడు



కొండవీటి కళాపరిషత్, పుచ్చలపల్లి సుందరయ్య నాటకోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సంయుక్త జాతీయ స్థాయి నాటకోత్సవాలు మండలంలోని లింగారావుపాలెంలోని జెడ్‌పి పాఠశాల ప్రాంగణంలో ఆదివారం రాత్రి ప్రారంభమయ్యాయి. ప్రదర్శనలను డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, మల్నేని సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అధికారుల అనుమతితో నిర్వహిస్తున్న ఈ నాటికల ప్రదర్శనలను ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పరిషత్ కార్యవర్గం

▶ 2లో

పెంచిన, బకాయి వేతనాలు సకాలంలో చెల్లించండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సమ్మె సందర్భంగా పెంచుతామని చెప్పిన వేతనాలు, పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జెఏసి ఆధ్వర్యంలో ఒక్కపూట విధులు బహిష్కరించి పుర పాలక సంఘం కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ఎంత గానో శ్రమిస్తున్న తమకు వేతనాల పెంపులో జాప్య మెందుకు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అమరారపు సాల్మన్ మాట్లాడుతూ తమకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోతే కుటుంబ పోషణ ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి ,మార్చి వేతనాలు ఇవ్వకుండా కార్మికులను ఇబ్బంది పెట్టడం సబబు కాదన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఉన్న డబ్బులను కాంట్రాక్టర్లకు మళ్లించి వేతన జీవులైన కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. సమ్మె సందర్భంగా హెల్త్ అలవెన్స్ నిలిపివేశారని, పెంచిన వేతనాలు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు 2 నెలల వేతనాలు పెండింగ్ ఉన్నాయన్నారు. సంక్రాంతి కానుక కింద ఇవ్వాల్సిన వెయ్యి రూపాయల బోనస్ కూడా ఇవ్వలేదన్నారు. 2021-22, 23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు,సమ దుస్తులు ఇవ్వలేదని మండి పడ్డారు. చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యుల పేర్లు ఆప్కాస్‌లో నమోదు చేయాలని, ఇటీవల పురపాలక సంఘం ట్రాక్టర్ ఢీ కొని ప్రమాదంలో మృతి చెందిన దేపంగి కోటయ్య కు ప్రమాద బీమా కింద రూ.7 లక్షలు తక్షణమే చెల్లించాలని, 2 సెంట్ల ఇటి స్థలం కుటుంబంలో ఇద్దరికీ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్కర్స్ చేత ట్రాకర్లు తీయిస్తున్నారని వారికి ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డికి వినతిపత్రం అంద జేశారు. నిరసనలో యూనియన్ పట్టణ అధ్య క్షులు తాతపూడి మల్లయ్య, కార్యదర్శి యోహన్, యూనియన్ నాయకులు వీరకుమార్, జీవరత్నం, మార్తమ్మ, రమణమ్మ ,విజయలక్ష్మి, జకరయ్య, డేవిడ్, దీనమ్మ పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

వేతనాలు తక్షణమే చెల్లించాలి

తాతపూడి మల్లయ్య,పారిశుధ్య కార్మికుడు



కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించడం దుర్మా ర్గం. నెలలు తరబడి వేత నాలు ఇతర రాయితీలు హెల్త్ అలవెన్సులు ఇవ్వకపోతే పారిశుధ్య కార్మికుల జీవనం ఎలా. నిరసన చేసినప్పటికీ మున్సిపల్ కమిషనర్ స్పష్టమైన హామీ ఇవ్వలేదు. యాప్‌లు ఇంకా ఓపెన్ కావడం లేదని, అవగానే వేత్తలు చెల్లిస్తామని మున్సిపల్ కమిషనర్ చెబుతున్నారు.

అప్పులు చేసి పోషించుకుంటున్నాం

ఉదయమ్మ, పారిశుధ్య కార్మికురాలు



సకాలంలో వేతనాలు రాకపోవడంతో అప్పులు చేసి అర్థాకులతో కుటుం బాలను పోషించుకోవాల్సిన పరిస్థితి దాపురిం చింది. వేతనంపై ఆధార పడి బతికే కార్మి కులను ఇబ్బంది పెట్టడం అధికారులకు ప్రభుత్వానికి సరైంది కాదు. ఒకవైపు పెరి గిన నిత్యావసర సరుకులతో జీవనం దుర్భరంగా మారింది. కార్మిక చట్టాలు పటి ష్టం చేసి సకాలంలో వేతనాలు ఇవ్వాలి.

బ్రహ్మయ్య హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

విచారణాధికారిగా అడిషనల్ ఎస్‌పి శ్రీనివాసరావు

ఎస్‌పి తుషార్ దూడి హామీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఇటీవల గుంటూరుకు సమీపంలో హత్యకుగురైన సిపిఐఎంఎల్ న్యూ డెమక్రసీ మాజీ నాయకులు నాదెండ్ల బ్రహ్మయ్య కేసును వేగంగా దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేయాలని పలువురునాయకులు సోమవారం జిల్లాఎస్‌పిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదరావు, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ కుమార్, జన చైతన్య వేదిక అధ్య క్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, బ్రహ్మయ్య భార్య సామ్రాజ్యం, కూతురు మణిచందనలతో కలిసి దళిత, బహుజన, ప్రజా సంఘాల నాయకులు ఎస్‌పిని కలిశారు. ఇందుకు స్పందించిన ఎస్‌పి తుషార్ మాట్లాడుతూ బ్రహ్మయ్య కేసు విచారణాధి కారిగా జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీని వాసరావుని నియమించి కేసు విచారణను వేగవంతం చేయ నున్నట్లు హామీ యిచ్చారు. అనంతరం డొక్కా మాణిక్య వరప్రసాదరావు, కొరివి వినయ కుమార్, వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేద, దళిత, గిరిజన కులాలకు ఒక న్యాయం, అగ్ర కులాలకు మరొక న్యాయం చేయడం అన్యాయమన్నారు.

పల్నాడులో వైసిపి అధినేత జగన్ రోడ్ షో

(మొదటి పేజీ తరువాయి)

ఇరువైపులా ప్రజలు నిలిచి జగన్మోహన్‌రెడ్డికి స్వాగతం పలికారు. గజమాల తోరణాలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. మరోవైపు బస్సుయాత్ర ప్రకాశం జిల్లా దర్శి నుండి కుడిచేడు మీదగా సోమవారం వినుకొండకు రావడంతో అటువైపుగా వెళ్ళు బస్సు సర్వీసులు నిలిపివేశారు. వినుకొండ నుండి వయా కురిచేడు దర్శి వైపు వెళ్లే ఆర్టీసీ సర్వీస్‌లను నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. సిఎం బస్సు యాత్ర వినుకొండకు వస్తుండడంతో సోమవారం ఉదయం నుండి చీకటిగలపాలెం అడ్డరోడ్డు వద్ద పోలీసులు వాహన రాకపోకలను నిలిపివేశారు. ప్రైవేట్ వాహనాలనూ అనుమతించలేదు. శావల్యాపురం మండలం గంటవారిపాలెం వద్ద జగన్మోహన్‌రెడ్డి రాత్రి బస చేయడంతో మధ్యాహ్నం నుండి బస్సు సర్వీస్‌లు నిలిపివేశారు. సంతమాగులూరు అడ్డ రోడ్డు వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేసి వినుకొండ వైపు రానివ్వకుండా నిలిపివేశారు. వినుకొండ నుండి కురిచేడు, దర్శి తదితర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు బస్సు సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

పోలీస్ బందోబస్తు..

బస్సు యాత్రకు ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చీకటిగలపాలెం అడ్డరోడ్డు వద్ద, వితంరాజుపల్లి, కారంపూడి రోడ్డు, శావల్యాపురం తదితర ప్రాంతాల్లో పోలీసులు బారికేడ్లు ఏర్పాటుతో కట్టుదిట్టంగా బందోబస్తు చేశారు. వినుకొండ పట్టణం నుండి వితంరాజుపల్లి, కనుమర్లపూడి, శావల్యాపురం గ్రామాల మీదగా గంటవారిపాలెం వద్ద సిఎం జగన్ బస చేసే విడిది కేంద్రం వరకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కిడ్నాప్ కేసులో మరొకరికి జీవిత ఖైదు

(మొదటి పేజీ తరువాయి)

కొంత దూరం తీసుకువెళ్లాక మంద రవి, ఉయ్యూరు ఆలీ, పరిమి నాగరాజు, వెంకన్న కారులో ఎక్కి ఆమెను కాళ్లు చేతులు బంధించారు. అనంతరం ఆమె ఫోన్ నుంచి 'మీ అమ్మాయిని కిడ్నాప్ చేసాం. రూ.మూడు కోట్లు ఇస్తే వదిలిపెడతాం' అని ఆమె తండ్రికి ఫోన్ చేశారు. వెంటనే ఆయన పోలీసులను సంప్రదించగా కారు పామర్రు వద్ద రోడ్డు పక్కన ఆపివుంచి చినట్లు పోలీసులు గుర్తించారు. తాడికొండ ఎస్సై కేవీ కోటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లగా ఆలీ, నాగరాజు, వెంకన్న పరారయ్యారు మంద రవి, పిన్ని బోయిన ప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో మిగిలిన నిందితులకు గతంలోనే జీవిత ఖైదు పడింది. మంద రవి హైకోర్టును ఆశ్రయించటంతో కొంత జాప్యమైంది. చివరకు అతనిపై కూడా విచారణ పూర్తయి సోమవారం న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నక్కా శారదామణి వాదనలు వినిపించారు.

రసవత్తరం.. సందేశాత్మకం

(మొదటి పేజీ తరువాయి)

కట్టా శ్రీహరిరావు, తోకల సాంబశివరావు, కట్టా వీరాంజనేయులు, మల్నేని సీతారామయ్య, నంబూరి వీరాంజనేయులు, మండెపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలి ప్రదర్శనగా చెలికాని వెంకట్రావు రచన, దర్శకత్వంలో 'కొత్తతరం కొడుకులు' నాటికను మణికంట ఆర్ట్స్-పిఠాపురం కళాకారులు ప్రదర్శించారు. రెండో ప్రదర్శనగా పిటి మాధవ్ రచించిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' నాటికను చలసాని కృష్ణప్రసాద్ దర్శకత్వంలో తెలుగు కళాసమితి - విశాఖపట్నం కళాకారులు ప్రదర్శించారు. చివరి ప్రదర్శనగా కావూరి సత్యనారాయణ రచించిన 'అమృతహస్తం' నాటికను ఏపూరి హరిబాబు దర్శకత్వంలో అమరావతి ఆర్ట్స్ గుంటూరు కళాకారులు ప్రదర్శించారు. ఆద్యంతం అద్భుత నటన, ఆకట్టుకునే సందేశాలతో ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశాయి.

రెండోరోజైన సోమవారం రాత్రి తొలి ప్రదర్శనగా కరణం మెమోరియల్ థియేటర్స్ గుంటూరు ఆధ్వర్యంలో 'నాలోన నీవే' నాటికను ప్రదర్శించారు. రచన, దర్శకత్వ బాధ్యతలు బొమ్ముడి రాధాకృష్ణ చూశారు. తండ్రి చనిపోయిన శ్రీకాంత్‌కు తల్లే సర్వస్వం. ఆమెంటే అతనికి అమితమైన ప్రేమ, గౌరవం కూడా. ప్రేమించి పెళ్లి చేసుకున్న జానికినీ ఇదేవిధంగా చూస్తాడు. అయితే అత్తా కోడళ్ల మధ్య కూడా ప్రేమ, అభిమానం, అప్యాయత బాగుండాలని శ్రీకాంత్ చేసే ప్రయత్నమే నాటిక సందేశం. నాటిక, రెండో ప్రదర్శనగా పండు క్రియేషన్స్ కొప్పోలు వారి ఆధ్వర్యంలో గోవిందరాజుల నాగేశ్వరావు రచించిన 'పక్కింటి మొగుడు' నాటికను బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వంలో ప్రదర్శించారు. భార్యాభర్తలు సఖ్యతగా ఉంటేనే తన ఆస్తి మనవడికి దక్కుతుందని, లేకుంటే ఆస్థంతా ఒక ఆశ్రమానికి చెందేలాగువ వీలువామా రాసి కన్నుమూశారు ఓ తాతగారు, బామ్మగారు. వీలునామాలో చూపిన రూ.రెండు కోట్ల ఆస్తిని వారికి ఇవ్వడానికి ఓ లాయరు వచ్చినపుడు ఆస్తి తీసుకునే వ్యక్తి మధు ఇంట్లో ఉండడు. అప్పుడు తన స్నేహితురాలి ఆస్తిని కాపాడటం కోసం సీత తన భర్తని స్నేహితురాలి భర్తగా చూపించి నాటకమాడుతుంది. ఆ నాటకంలో భాగంగా సీత తనకు ఇంకా పెళ్ళి కాలేదని చెప్పగా, లాయరు ఆమెను ప్రేమిస్తున్నానని, కాబట్టి పెళ్లి చేసుకోవాలని అడుగుతాడు. ఈలోపు మధు వస్తాడు. అతనికి ఈ నాటకం విషయం చెప్పి ఆ లాయరును కట్టడి చేయాలని నీవు సీతకు అన్నగా నటించమని చెబుతారు. లాయరు మధుతో సీతను పెళ్ళికి ఒప్పిస్తే నాకున్న ఇల్లు, పాతిక లక్షల చెక్కు ఇస్తావని చెబుతాడు.గోపి తండ్రి జగన్నాథం గోపి ఇంటికి వస్తాడు. తన కోడలు ఎవరో తెలియక తికమక పడుతుండగా పక్కింటి స్నేహితురాలికి ఆస్తి ఇప్పించడం కోసమే ఈ నాటకమాడామని చెబుతారు. లాయరు తన ఇంటి ఆస్తి పత్రం, పాతిక వేల చెక్కు ఇచ్చి సీతతో పెళ్ళి చేయమని కోరతాడు. వీళ్ళాడిన నాటకం విషయం లాయరుకు చెబుతారు. లాయరు బాధపడుతూ తన ఆస్తి తనకు ఇవ్వాలని కోరతాడు.

ఇతరుల అవసరాలను అవకాశంగా తీసుకొని ఎదుటివారిని బ్లాక్మెయిల్ చెయ్యటం తప్పనే సందేశంతో నాటిక కొనసాగింది. మూడో ప్రదర్శనగా టి.కృష్ణ మెమోరియల్ ఆర్ట్ థియేటర్ మిట్టపాలెం వారి దండా అనంతబాబు, జరుగుల రామారావు రచించిన 'ప్రేమించే వయసేనా?' నాటికను జరుగుల రామారావు దర్శకత్వంలో ప్రదర్శించారు. మంగళ, బుధవారాల్లో మరో ఆరు నాటికలు మండల కేంద్రమైన యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణంలో ప్రదర్శించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-తెనాలి



ఎలక్ట్రిక్ సైకిల్ పై వెళుతున్న మహిళను మినీ వ్యాన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూరల్ పోలీసులు వెల్లడించిన వివరాలు ప్రకారం నందివెలుగుకి చెందిన కట్ట రాజ్యలక్ష్మి (45) సోమవారం వ్యక్తిగత పనుల నిమిత్తం గ్రామంలో ఎలక్ట్రిక్ సైకిల్ పై వెళుతుండగా మిని వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో రాజ్యలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు.

పోస్టల్ బ్యాలెట్‌లపై పార్టీల దృష్టి!

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్యశాఖ ఉద్యోగులు, అగ్నిమాపక శాఖతో పాటు వివిధ శాఖల ఉద్యోగులతో కలిపి మొత్తంగా 25 వేల వరకు ఉంటారని అంచనా.

విధులు కేటాయించిన తరువాత కూడా గైర్హాజరు అయితే ఇబ్బంది లేకుండా ఉండేందుకు 20 శాతం రిజర్వు ఉద్యోగులను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. వీరంతా పోలింగ్ రోజున వారి స్వస్థలంలో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశంలేకపోవడం వల్ల పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. పోలింగ్ సిబ్బందికి కూడా ఎన్నికల విధుల కేటాయింపులో జంబ్లింగ్ విధానం అవలంభించనున్నారు. పోలింగ్ సిబ్బంది జన్మస్థలం, నివశించే ప్రాంతం ఉన్న నియోజకవర్గంలో వారికి ఎన్నికల విధులు కేటాయించరు. మరొక నియోజకవర్గంలో విధులు కేటాయిస్తారు. అందువల్ల ఉద్యోగులు వారికి ఓటు ఉన్న నియోజకవర్గంలోనే పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి ముందుగానే దరఖాస్తు చేసుకోవాలి. ఈ మేరకు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

సిపిఎం మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా జొన్నా శివశంకరరావు

(మొదటి పేజీ తరువాయి)

పోరాటాలు చేస్తున్నారు. పెదవడ్లపూడి హైలెవెల్ ఛానల్ పూర్తి చేయాలని ఆందోళన చేశారు. కొండవీటి వాగులో తూటికాడ, గుర్రపు డెక్క తొలగించాలని ఆందోళన చేశారు. తెనాలి డెల్టా కాల్వల ఆధునీకరణ పనులు చేపట్టాలని, తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని ఆందోళనలు చేశారు. ప్రకాశం బ్యారేజీపై వాహనాల రాకపోకల నిషేధాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేశారు. పెంచిన ఇంటి పన్ను, చెత్త పనులు తగ్గించాలని ఆందోళన చేశారు. ఇలా నిరంతరం పోరాటాలే లక్ష్యంగా ఉద్యమ ప్రస్థానాన్ని కొనసాగిస్తు న్నారు. తాజాగా సార్వత్రిక ఎన్నికల్లో మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

ఇండియా వేదిక అభ్యర్థుల్ని గెలిపించాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు. ఎన్నికల బాండ్ల పేరుతో వేల కోట్ల రూపాయలు అవినీతికి మోడీ ప్రభుత్వం పాల్పడిందన్నారు. మతోన్మాదంతో దేశ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుందని, మత విద్వేషాలు రెచ్చగొడుతూ హిందుత్వం పేరుతో భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే విధంగా బిజెపి ప్రభుత్వం పని చేస్తోందని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో 'ఇండియా' వేదిక అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు కె.శ్రీనివాసరావు, షేక్.ఖాశింషహీద్, సిపిఐ నాయకులు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

గుండెపోటుతో భవన నిర్మాణ కార్మికుడు ఓబయ్య మృతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి :సత్తెనపల్లి పట్టణానికి చెందిన నిర్మాణ కార్మికుడు కొత్త ఓబయ్య (66)ఆదివారం రాత్రి మృతి చెందారు. పట్టణంలోని 19వ వార్డుకు చెందిన భవనిర్మాణ కార్మికుడు కొత్త ఓబయ్య తాపీ మేస్త్రి గా జీవనం సాగిస్తూ ఉన్నాడు. ఆయనకు గత కొన్ని రోజులుగా గుండెపోటుతో బాధపడుతున్నాడు. ఇటీవల గుంటూరులో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ చేయించు కున్నారు. అయితే, పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. భౌతికకాయాన్ని సత్తెనపల్లి తన స్వగహానికి తరలించారు. సోమవారం ఓబయ్య భౌతికకాయాన్నిసందర్శించి కార్మికులు నివాళు లర్పించారు. ఓబయ్యకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.





నివాళులర్పిస్తున్న నాయకులు (ఓబయ్య ఫైల్‌ఫొటో)

ఓబయ్య అంత్యక్రియలు సోమవారం సాయంత్రం సత్తెనపల్లిలో జరిగాయి. ఓబయ్యను సందర్శించి నివాళులర్పించిన వారిలో భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాద్ రావు, సత్తెన పల్లి తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి మహేష్, ఆదినారాయణ, ఉపాధ్యక్షులు షేక్ సుభాని, ట్రెజరర్ సీతయ్య, తోటి కార్మికులు బాలస్వామి, వెంకటరావు,కొండలు, మాధంశెట్టి వెంకట్రావు పాల్గొన్నారు.

అత్తను కత్తితో పొడిచిన అల్లుడు

పరిస్థితి విషమం.. గుంటూరు తరలింపు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

భార్యాభర్తల మధ్య జరుగు తున్న వివాదంలో అడ్డొచ్చిన అత్తను అల్లుడు కత్తితో పొడిచిన సంఘటన పిడుగురాళ్ల పట్టణం లోని రైల్వే స్టేషన్ రోడ్ లో సోమవారం చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివ రాల ప్రకారం పిడుగురాళ్లకి చెందిన మసూద్‌కు పట్టణం లోని మార్కెట్ యార్డు సమీపంలోని సాజిదాకు ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ముగ్గురు ఆడపిల్లలు. మగ పిల్లాడి కోసం సాజిదాపై నిత్యం మసూద్ వేధింపులు జరిపే వాడు. ఇటీవల మగపిల్లాడు కావాలని మరో పెళ్లికి సిద్ధపడ్డ మసూద్, సాజిదాను పుట్టింట్లో వదిలిపెట్టాడు. దీంతో, సాజిదా తన కుటుంబ సభ్యులతో కలిసి మసూద్ ఇంటి వద్ద ఆందోళనకు దిగింది. ఈ ఆందోళనతో మసూద్ తన భార్యను, పిల్లలను తన వద్ద ఉంచుకుంటానని, మరో పెళ్లి చేసుకోనని చెప్పి ఇంటికి తీసుకెళ్లాడు. కానీ, భార్యతో మళ్లీ గొడవలు పెట్టుకోవడం, రాత్రి సమయంలో కొట్టడం, హిం సించడం చేసేవాడని సాజిద తన తల్లిదండ్రులు బాజీ ,ఫైజున్నిసాకు తెలిపింది. ఆదివారం రాత్రి సమయంలో సాజిదాను కొట్టడంతో సోమవారం ఉదయం ఈ విషయమై మసూద్‌ను ఫైజున్నిసా ప్రశ్నించింది. తమ కుమార్తెను ఎందుకు కొడుతున్నావ్ అని ప్రశ్నించిన ఆమెను, 'నా ఇంటికి ఎందుకు వచ్చావు?' అంటూ అత్తపై అల్లుడు దాడికి దిగాడు. అడ్డొచ్చిన సాజిదాను మసూద్ కత్తితో పొడవబోగా అత్త ఫైజున్నిసా అడ్డువచ్చింది. మసూద్ తన చేతిలోని కత్తితో ఫైజున్నీసా కడు పులో మూడుసార్లు పొడిచాడని వెంటనే బంధువులు ఆమెను పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించాలని తెలిపారు. మసూద్ పరారీలో ఉన్నాడని చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పట్టణ సిఐ తెలిపారు.

పెద్దల నుంచి రక్షణ కల్పించాలని పోలీసులకు వినతి

ప్రజాశక్తి - యడ్లపాడు :కులాంతర వివాహం చేసుకున్న ప్రేమికుల జంట పెద్దల నుంచి తమకు రక్షణ కల్పించాలని పోలీ సులను ఆశ్ర యించింది పోలీసుల కథనం మేరకు యడ్లపాడు మండలం సొలసకు చెందిన యువకుడు, యువతి గత నెల 29న ఊరు విడిచి వెళ్లారు. దీంతో, యువతి తల్లి తన కుమార్తె కనిపించడం లేదని ఈ నెల 2న పోలీసులు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో సదరు ప్రేమికులు పెళ్లి చేసుకుని ఆదివారం యడ్లపాడు పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. మేజర్‌లు అయినా తాము ఇష్ట ప్రకారమే వివాహం చేసుకున్నామని, కుటుంబ పెద్దల నుంచి తమకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. దీంతో యువతి తల్లిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు, నూతన దంపతులతో మాట్లాడించారు. తాము కలిసి జీవించాలని నిర్ణయించుకున్నట్లు దంపతులు వెల్లడించారు.

ఓటమి భయంతో ఆధారాలు మాయం : టిడిపి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి జగన్ గ్యాంగ్ ఆధారాలు మాయం చేసే పనిలో పడిందని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. స్థానిక పండరీపురంలోని తన నివాసంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాగితాలు కాల్చేయడం, ఆధారాలు మాయం చేసినంత మాత్రాన చేసిన తప్పుల నుంచి వారు ఎట్టిపరిస్థితుల్లో తప్పించుకో లేరన్నారు. తాడేపల్లిలో సిట్ ప్రాంగణంలో పెద్దమొత్తంలో పత్రాలను దగ్ధం చేయడం, అందులో హెరిటేజ్ పేరున్న పేపర్లు కూడా ఉండడంలో ఏదో భారీ కుట్ర దాగి ఉన్నట్లు కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక 8, 9, 11వ వార్డుల కుటుంబ సాధికార సారథులు, బూత్ కన్వీన ర్లు, పార్టీ నాయకులతో సమీక్షా సమావేశం ఆయన నివాసంలో నిర్వహించారు. క్రోసూరులో భాష్యం ప్రవీణ్ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ జనసేన సమన్వయకర్త తోట రాజా రమేష్ పాల్గొన్నారు.

నాగులవరం, గోకనకొండలో ప్రచారం



ప్రజాశక్తి - వినుకొండ : రాష్ట్రంలో కూటమి గెలుపుతోనే రాక్షసరాజ్యం, దోపిడీ పాలనకు అంతమని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షుడు, వినుకొండ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. ఇసుక, మట్టి, మద్యం దేన్నీ వదలకుండా విచ్చలవిడిగా అవినీతి సొమ్మును పోగేసుకున్న దొంగల ముఠాను తరిమికొడితే తప్ప నవ్యాంధ్ర పునర్నిర్మాణం సాధ్యం కాదని, ఈ విషయాన్ని ప్రతిఒక్క ఓటరు గుర్తుంచుకోవాలని కోరారు. వినుకొండ మండలం నాగులవరం, గోకనకొండలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి జీవీ ఆంజనేయులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ గోదావరి జలాలతో పల్నాడు సాగు, తాగునీటి కష్టాలు తీర్చి చూపిస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికన వరికపూడిశెల ఎత్తిపోతల ప్రాజెక్టును సాకారం చేస్తామని, జలజీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికి నీటిని అందిస్తామనీ హామీ ఇచ్చారు.

ప్రజాశక్తి - మాచర్ల : మాచర్ల నియోజకవర్గంలో గత 15 సంవత్సరాలుగా పిన్నెల్లి సోదరుల అరాచక, రాక్షస పాలనకు అంతం పలుకుదామని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రజలను కోరారు. సోమవారం 14వ వార్డులో ఇంటింటికి జూలకంటి కార్యక్రమం చేప ట్టారు.

వాలంటీర్ వ్యవస్థకు టిడిపి వ్యతిరేకం కాదు : అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :వాలంటీరీ వ్యవస్థకు టిడిపి వ్యతిరేకం కాదని నరసరావుపేట నియోజకవర్గ ఉమ్మడి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట 25 వార్డ్ ప్రచారంలో పాల్గొన్నారు. డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ వాలంటీర్లకు రాబోయే ఎన్డీఏ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా చదలవాడ అరవిందబాబు కొడుకు డాక్టర్ చదలవాడ ఆదిత్య మాట్లాడుతు నాన్నకు ఒక్కసారి అవకాశం ఇస్తే నరసరావుపేట నియోజకవర్గ రూపు రేఖలు మార్చి అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. 25 వ వార్డులో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు.



నివాళులర్పింస్తున్న ఎ.లక్ష్మీశ్వరరెడ్డి పి.మహేష్ తదితరులు ఇన్‌సెట్‌లో.. మృతి చెందిన కంబాల శివ (ఫైల్)

సిపిఎం సీనియర్ నాయకులు కంబాల శివ మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కంబాల శివ (70) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. భౌతికకాయాన్ని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి హామీ పనులు సరిగా అమలు చేయాలని జరిపిన పోరాటంలో శివ ముందున్నారని, రజకుల ఇళ్ల స్థలాల పోరాటంలో అగ్రభాగాన నిలబడి ఇళ్ల స్థలాలు తెప్పించడంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. గ్రామంలో జరిగే అనేక పోరాటాల్లో ముందుండి ప్రచారం చేశారన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకూ నిలబడ్డారని, నీతి, నిజాయితీతో వ్యవహరించారని కొనియాడారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘంలో చురుగ్గా పని చేసిన శివ గ్రామంలో సంఘ నిర్మాణానికి ఎంతో కృషి చేశారన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్ నాయకులు ఆర్.పూర్ణచంద్రరావు, కె.వెంకటేశ్వర్లు షేక్ హుస్సేన్‌షా, వి.తులసీరామ్, జె.రాజ్‌కుమార్, డి.నాగేశ్వరరావు, డి.మేరమ్మ, డి.సుజాత జె.అనూష ఉన్నారు.

పాత రూ.వంద నోటు, రూ.10, 20 నాణేలు చెల్లుతాయి : ఎస్‌బిఐ మేనేజర్

ప్రజాశక్తి - మాచర్ల : పాత రూ.వంద నోటు, రూ.10, 20 నాణేలు చలామణీలోనే ఉన్నాయని, వాటిని ఆర్‌బిఐ నిషేధించలేదని స్థానిక ఎస్‌బిఐ మేనేజర్ ఎస్.క్రిష్ణారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అనవసర పుకార్లును నమ్మవద్దని వ్యాపారులకు, ప్రజలకు సూచించారు. రూ.10, రూ.20 నోట్లు సరఫరా తక్కువగా ఉన్న దృష్ట్యా వ్యాపారులు, ప్రజలు తమ లావాదేవీల్లో రూ.10, రూ.20 నాణేలను ఉపయోగించాలన్నారు. ఇప్పటికి బ్యాంక్‌లలో, ఆర్.టి.సి, రైల్వే, ప్రభుత్వ సంస్థల్లో ఎక్కడా రూ.10 నాణేలను తీసుకోవడం లేదని చెప్పలేదన్నారు. ఇటీవల మాచర్ల పట్టణంలో పెట్రోలు బంకుల వారు పాత రూ.వంద నోటు తీసుకోవటం లేదని తమ దృష్టికి వచ్చిందని, వాటిని తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు.

కార్యాలయ దహనంపై నిష్పక్షపాతంగా విచారణ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - క్రోసూరు : టిడిపి పెదకూరపాడు నియోజకవర్గ కార్యాలయ దహనంపై ఉన్నతాధికారులు సత్వరమే నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు కోరారు. ఈ మేరకు స్థానిక ఆమంచి భవన్‌లో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కార్యాలయం దహనం కేసులో దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి చర్యల వల్ల ప్రశాంతంగా ఉండే ప్రజల మధ్య ఆపోహలు పెరిగి శాంతి భద్రతల సమస్య ఏర్పడుతుందని, దీన్ని తొలిదశలోనే నివారించాలని కోరారు. ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చించడం, ప్రజల మన్ననలు పొంది ఓట్లేయించుకోవడం వంటివాటికి ప్రయత్నించాలనేగాని ఉద్రిక్తలు రెచ్చగొట్టే చర్యలు తగదన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిని అధికారులు గుర్తించి నియంత్రించాలన్నారు. తాజా ఘటనపై వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలన్నారు.

ప్రజాస్వామ్యం నిలబడాలంటే ఇండియా అభ్యర్థులు గెలవాలి

- ఎన్‌డిఎ కూటమి, వైసిపిని ఓడిచేందుకు పోరాడతాం
- ఇండియా ఫోరం పార్టీల నాయకుల ఉద్ఘాటన



ఐక్యతా అభివాదం చేస్తున్న ఇండియా ఫోరం పార్టీల అభ్యర్థులు, నాయకులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

అధికార వైసిపి, ఎన్‌డిఎ కూటమికి వ్యతిరేకంగా ఈ ఎన్నికల్లో 'ఇండియా' ఫోరం తరుపున గెలుపే లక్ష్యంగా పోరాడతామని కాంగ్రెస్ పార్టీ తరుపున నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అలెగ్జాండర్ సుధాకర్ అన్నారు. గురజాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని గురజాలలో సోమవారం ప్రారంభించిన ఆయన అనంతరం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి సిపిఐ నాయకులు కృష్ణ నాయక్ అధ్యక్షత వహించారు. అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ బిజెపి పాలనలో పోలీసు వ్యవస్థను వాడుకొని కాంగ్రెస్, వామపక్ష నాయకులను అనేక ఇబ్బందులు గురి చేస్తున్నారని అన్నారు. ప్రొఫెసర్ సాయిబాబాను, విరసం నేత వరవరరావు జైల్లో పెట్టి అనేక ఇబ్బందులు గురిచేసారని చెప్పారు. ప్రజల మధ్య మత విద్వేషాలను బిజెపి రగిలిస్తోందని, ప్రజా ఉద్యమాలపై అణచివేతలకు పాల్పడుతోందని విమర్శించారు. దేశ అభివృద్ధి కాంగ్రెస్, కమ్యూనిస్టు ఆధ్వర్యంలోనే జరిగిందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో రామ మందిరాన్ని అడ్డుపెట్టుకొని మళ్లీ గెలవాలని బిజెపి యత్నిస్తోందని, ఈ కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు. సిపిఎం పలనాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ మతాన్ని బిజెపి తన స్వార్థ రాజకీయలకు వాడుకుంటోందని అన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిములు, కమ్యూనిస్టులు ఎంతోమంది పాల్గొని ప్రాణ త్యాగాలూ చేశారని, బిజెపి, దాన్ని నడిపిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర ఏమీ లేదని అన్నారు. ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం, అటవీ హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం వంటి ఎన్నో ప్రజోపయోగమైన చట్టాలు కమ్యూనిస్టుల మద్దతుతో నడిసిన కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ-1లో వచ్చాయని చెప్పారు. గుడులు కట్టించి అధికారంలోకి రావాలని చూస్తున్న బిజెపి కుట్రలను 'ఇండియా' ఫోరం అడ్డుకుంటుందన్నారు. బిజెపితో జతకట్టిన, తొత్తుగా వ్యవహరిస్తున్న టిడిపి, జనసేన, వైసిపిలను రాష్ట్రంలో ఓడించాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.రమణారెడ్డి, నాయకులు హుస్సేన్, సిపిఎం నాయకులు ఆంజనేయరాజు, టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆస్తులు అమ్ముకున్నారని, మతోన్మాదాన్ని పెంచారని అన్నారు. దేశానికి వారు చేసిన మేలు ఏదీ లేదన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే 'ఇండియా' ఫోరం పార్టీలు గెలవాలన్నారు. నరసరావుపేట, గురజాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఎస్ఎం భాష, యలమందరెడ్డి మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వస్తే ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీలను అణగదొక్కుతారని, అందుకే ఇండియా ఫోరం పార్టీలు, అభ్యర్థులను గెలిపించుకోవాలని అన్నారు. ఎంసిపిఐ నాయకులు అబ్రహం లింకన్, కాంగ్రెస్ నాయకులు యోహాన్ మాట్లాడుతూ హక్కుల కోసం పోరాడిన ప్రజాసంఘాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేస్తున్నాయని, ఈ నేపథ్యంలో ఇండియా ఫోరం అభ్యర్థులు గెలిస్తేనే ప్రజాస్వామ్యం బతుకుతుందని అన్నారు. ఈ అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పారు.

ఇండియా ఫోరం అభ్యర్థుల ప్రచారం



ప్రజాశక్తి - మాచర్ల : ఇండియా ఫోరం తరుపున మాచర్ల ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు వై.రామచంద్రారెడ్డి పట్టణంలోని నెహ్రూనగర్‌లో సోమవారం ప్రచారం చేపట్టారు. ప్రత్యేక హోదాతో సహ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 9 గ్యారెంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వంగపాటి నాగరాజు, షేక్ బాబు, గాదె పుల్లారెడ్డి, నాజర్‌వలి పాల్గొన్నారు.



ప్రజాశక్తి - చిలకలూరిపేట : స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌కు దగ్గర్లోని పొగాకు కంపెనీలో పని చేస్తున్న మహిళ కార్మికుల ప్రాంతాల్లో చిలకలూరిపేట అసెంబ్లీ నియోజవర్గం నుండి ఇండియా ఫోరం తరుపున కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎం.రాధాకృష్ణ ప్రచారం చేశారు. బిజెపి మత రాజకీయ ప్రమాదాలను వివరించారు. కార్మిక హక్కులను కేంద్రంలోని బిజెపి కాలరాస్తోందని, ఆ పార్టీ విధానాలకు రాష్ట్రంలోని అధికార ప్రతిపక్షాలు వంతపాడుతున్నాయని చెప్పారు. తమను గెలిపించాలని కోరారు.



కార్యాలయం వద్ద దహనమైన పందిరి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ప్రవీణ్, శ్రీధర్

ఓటమి భయంతోనే వైసిపి నిప్పు

భాష్యం ప్రవీణ్, కొమ్మాలపాటి శ్రీధర్ ఆరోపణ - చర్యల కోసం సిఐకు ఫిర్యాదు

ప్రజాశక్తి - క్రోసూరు

కేవలం ఓటమి భయంతోనే ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు అక్రమాలు, అరాచకాలు చేస్తున్నారని టిడిపి, జనసేన బిజెపి కూటమి తరుపున పెదకూరపాడు ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ఆరోపించారు. టిడిపి కార్యాలయ దహనంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సోమవాఉరం ర్యాలీగా వెళ్లి సిఐ మంగారావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ క్రోసూరులోని టిడిపి నియోజకవర్గ కార్యాలయం వైసిపి మూకలే దహనం చేశాయని, క్రోసూరులో జరిగిన ప్రజాగళం సభ విజయవంతం కావడాన్ని తట్టుకోలేకే ఇందుకు పాల్పడ్డారని అన్నారు. దాడులు, అక్రమ కేసులు, అరాచకాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి అక్రమంగా గెలిచేందుకు శంకరరావు యత్నిస్తున్నారని, ఆయనకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కేవలం అధికార మదం, డబ్బున్న అహంకారాలను ఆయుధాలుగా మలుచుకొని గతంలో లేని దాడుల సంస్కృతికి తెరలేపారని అన్నారు. రౌడీ రాజ్యాన్ని అంతమొందించాలంటే ఓటుతో చావుదెబ్బ కొట్టాలని ప్రజల్ని కోరారు. తాము చిటికేస్తే 10 నిమిషాల్లో వైసిపి కార్యాలయాలు, వారి ఇళ్లు ధ్వంసమవుతాయని, అయితే క్రమశిక్షణ కలిగిన పార్టీగా తాము అందుకు పూనుకోబోమని అన్నారు.

ప్రజాగళం విజయవంతాన్ని జీర్ణించుకోలేకే : జీవీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజాగళం విజయవంతం అవడాన్ని జీర్ణించుకోలేకనే వైసిపి నాయకులు క్రోసూరు మండలంలోని టిడిపి కార్యాలయానికి నిప్పు పెట్టారని, ఇటువంటి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టిడిపి కార్యాలయానికి నిప్పంటించిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పందిరి దగ్ధమవుతుంటే సమీపంలో ఉన్న అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించినా ఆలస్యంగా వచ్చారని, అగ్నిమాపక యంత్రాన్ని వైసిపి నేతలే అడ్డుకున్నారని ఆరోపించారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో వైసిపి నేతలు ఇటువంటి విధ్వంసాలు, అశాంతిని నెలకొల్పడానికి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.

వారే తగలబెట్టుకున్నారు..

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ప్రజాశక్తి - క్రోసూరు



ఐదేళ్లుగా పెదకూరపాడులో ప్రశాంత వాతావరణం ఉందని, టిడిపి అభ్యర్థిని ప్రకటించిన రోజు నుంచి ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయానికి సోమవారం వచ్చిన ఆయన మాట్లాడుతూ టిడిపి కార్యాలయ దహనం ఘటనపై ఆయన స్పందిస్తూ టిడిపి కార్యాలయం వద్ద పందిరి దగ్ధమైతే తనకేం సంబంధమని ప్రశ్నించారు. నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యకర్తలు, బైకులు, కుర్చీలు అన్నీ క్షణాల్లో మాయం చేసి.. వాళ్లే పందిరి తగలబెట్టుకున్నారని ప్రత్యారోపణ చేశారు. గతంలో ధరణికోటలో వైసిపి కార్యాలయాన్ని తగలబెడుతూ ఇద్దరు టిడిపి కార్యకర్తలు పట్టుబడ్డారని చెప్పారు. తాజా ఘటనను ప్రజా ప్రతినిధిగా తాను ఖండిస్తున్నానని, బాధ్యులను వెంటనే గుర్తించి శిక్షించాలని పోలీసులను కోరుతున్నానని అన్నారు. క్రోసూరు ప్రజాగళం సభలో తనపై చంద్రబాబు చేసిన ఆరోపణలకు సమాధానమిచ్చానేగాని విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా తాను మాట్లాడలేదన్నారు. విధ్వంస రాజకీయాలకు తెరతీస్తున్న టిడిపి నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ఎమ్మెల్యే వెంట వైసిపి మండల అధ్యక్షులు వి.అప్పారావు, జెడ్‌పిటిసి జమీలా గఫూర్, ఎ.కోటిరెడ్డి, టి.అప్పిరెడ్డి ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

సిపిఎం మంగళగిరి అభ్యర్థి జొన్నా శివశంకరరావు



ప్రజాశక్తి-తాడేపల్లి :తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి పని చేస్తానని మంగళగిరి నియోజకవర్గ ఇండియా కూటమి బలపరిచిన సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు అన్నారు. తాడేపల్లి పట్టణంలోని పుష్కర కాలనీలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓట్లు కొల్లగొట్టేందుకు మతోన్మాద కార్పొరేట్ శక్తులు ముందుకు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వారిని వెనక్కి నెట్టి ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించడం ద్వారా ఒక మంచి ఒరవడికి శ్రీకారం చుట్టాలని కోరారు. కేంద్రంలోని మోడీ ఈసారి అధికారంలోకి వస్తే ఇక ఎన్నికలే ఉండవని చెప్పారు. అధ్యక్ష తరహా పాలన తేవాలని ఆ పార్టీ తహతహ లాడుతుందని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేయడంతో పాటు ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తుందని బిజెపిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపిలో ఒక్క శాతం ఓటింగ్ కూడా లేని బిజెపికి వైసిపి, టిడిపి, జనసేన ఆక్సిజన్ అందిస్తున్నాయన్నారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కె.మేరి, వి.సామ్యేలు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి దాని మిత్రులను ఓడించండి : సూర్యారావు

దేశంలో కార్పొరేట్లకు అనుకూలంగా పని చేస్తున్న బిజెపిని, దానికి మద్దతు ఇస్తున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను ఓడించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు ప్రజలను కోరారు. సోమవారం తాడేపల్లిలోని మక్కా మసీదు, ముగ్గురోడ్డు సెంటర్, బాబుల్లా కొట్టు సెంటర్లలో జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను గుత్త పెట్టుబడిదారులకు కారుచౌకగా అమ్మేస్తున్న బిజెపిని ఇంటికి సాగనంపాలని కోరారు. ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్న ఆర్ఎస్ఎస్, భజరంగదళ్ శక్తులను ఒంటిపాటు చేయాలని కోరారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో అనేక మంది ముస్లింలు త్యాగాలు చేశారని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో ఏ పాత్ర లేని వారు నేడు పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.విజయబాబు, కె.మేరి, కె.బాబూరావు, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

20ఏళ్లు సర్పంచ్‌గా సేవలు

ఆంధ్రప్రదేశ్‌లో మంగళగిరికి ఒక చరిత్ర ఉందని, ఇప్పటికే నాలుగు సార్లు కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులు, మరో రెండు సార్లు కమ్యూనిస్టు పార్టీలు బలపరిచిన అభ్యర్థులు మంగళగిరిలో గెలిచారని సిపిఎం సీనియర్ నేత దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో మండల అధ్యక్షుడిగా, సమితి ప్రెసిడెంట్‌గా, మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా నిమ్మగడ్డ రామ్మోహనరావు అందరికీ పరిచయమేనని చెప్పారు. అటువంటి నిమ్మగడ్డకు వారసుడైన జొన్నా శివశంకరరావు ఉండవల్లికి హ్యాట్రిక్ సర్పంచ్‌గా 20 సంవత్సరాలకు పైగా సేవలందించి మచ్చలేని నాయకుడిగా ప్రజల మన్ననలను పొందారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఇండియా బ్లాక్ కూటమి తరపున మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న జొన్నా శివశంకరరావుకు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

క్రోధి నామ ఉగాదికి స్వాగతం!!



కోయిలమ్మల
రాగాలాపనలతో,
లేలేత రెమ్మల వింజామరలతో,
మత్తెక్కించే మల్లియల
అత్తరులతో,
పచ్చని పచ్చిక పరిచి, ప్రకృతి కన్య
పరవశించి ప్రణమిల్లగా
క్రొంగొత్త అందాలతో
ఉత్సాహంగా వచ్చింది
క్రోధినామ ఉగాది !
నీపేరు జూచి భయపడుతున్న
మాకు ఊరట కలిగించు!
పరిరక్షించు.. మరుగున
పడిపోతున్న
మానవతా విలువల్ని
పెకలించి వేయి పుట్టగొడుగుల్లా
పుట్టుకొస్తున్న మానవాళి లోని
స్వార్థపు కలుపు మొక్కల్ని
ప్రక్షాళన చెయ్యి కలుషిత
మవుతున్న మానవ సంబంధాలను
తెగటార్చు
తెలుగుకి
పట్టిన
తెగులుని ....
సంతరించి పెట్టు పూర్వ వైభవాన్ని
నీ రాకతో కావాలి ఈ భువి
నందనవని..
వెల్లివిరియాలి సుఖ
శాంతులతో..
సమైఖ్య సౌజన్య పరిమళాలు
ఆనందహేలవై అడుగిడి
సౌభ్రాతృత్వ సుధలు కురిపించి,
శాంతి తోరణాలు కట్టు
అప్పుడే మా గుండెల
తలుపులు తట్టు
ఇదే నీకు స్వాగతం!
సుస్వాగతం!!

చుండూరు శేషుమాంబ
9912892842

నెహ్రూ నికేతన్ ఉపాధ్యాయులకు లీడ్ స్కూల్ పురస్కారాలు



ప్రజాశక్తి తెనాలి

మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా విద్యాబోధనలో నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ముందుందని లీడ్ స్కూల్ రీజనల్ డైరెక్టర్ బి సుబ్రహ్మణ్యం అన్నారు. విద్యా బోధనలో అత్యంత ప్రతిభను కనబరిచిన పాఠశాల ఉపాధ్యాయ బృందం 14 మందికి లీడ్ స్కూల్ జాతీయ పురస్కారాలను సోమవారం అందించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశంలో మూడు వేల పాఠశాలలకు పైగా లీడ్ స్కూల్ నిర్దేశించిన విద్యా విధానాలను అవలంభిస్తుదని చెప్పారు. 14 మంది ఉపాధ్యాయులకు లీడ్ స్కూల్ పురస్కారాల్ని అందించడమే కాకుండా, మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరికి ఉత్తమ పాఠశాల పురస్కారాన్ని కూడా అందించారు. మురళీకాంత్ దాసరి మాట్లాడుతూ ఆధునిక బోధన పద్ధతుల ద్వారా విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ బందాన్ని అభినందించారు. లీడ్ స్కూల్ నుంచి పురస్కారాలు అందుకోవటం విశేషం అన్నారు. కార్యక్రమంలో లీడ్ స్కూల్ జిల్లా అకాడమీ మేనేజర్ బివి సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయ బందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల తరపున లీడ్ స్కూల్ బృందాన్ని కూడా సత్కరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కొప్పర్రు జడ్‌పి పాఠశాలలో పర్యావరణంపై అవగాహన సదస్సు



ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

కొప్పర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో పర్యావరణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీన్ కోర్ జిల్లా కోఆర్డినేటర్ షేక్ గౌసుల్ మీరా మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని పర్యావరణ హిత జీవన శైలిని విద్యార్థులు అలవరచుకోవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఎకో క్లబ్బులను ఏర్పాటు చేసి విద్యార్థులలో పర్యావరణం పట్ల పరిపూర్ణ అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున విపరీతమైన మార్పుల గురించి, విద్యార్థులకు అవగాహన కల్పించి వారిని పర్యావరణ పరిరక్షణలో భాగ స్వాములు చేయటం అనేది ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రతి విద్యార్థికి మొక్కలు పెంచవలసిన ఆవశ్యకతపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, వకృత్వం పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ మరియు బహుమతులు అందజేశారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్. సాంబయ్య మరియు ఉపాధ్యాయులు రామారావు, వందనం, భాగ్యలక్ష్మి, రేఖ, సువర్చల, ఫణికుమారి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో ఎన్ఎంఆర్ సెంటర్ ప్రారంభం



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో పరిశోధనల పరంగా జరుగుతున్న అభివృద్ధి ప్రశంసనీయమని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (హైదరాబాద్) మాజీ డైరెక్టర్ మరియు ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ముంబయి) డైరెక్టర్ ఆచార్య మన్నేపల్లి లక్ష్మీకాంతం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిశోధనలను ప్రోత్సహించే ఉద్దేశంతో మంజూరు చేస్తున్న వివిధ రకాల గ్రాంట్లను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కేంద్ర ప్రభుత్వం డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా మంజూరు చేసిన రూ.2.20 కోట్ల నిధులతో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఏర్పాటు చేసిన ఎన్ఎంఆర్ (న్యూక్లియర్ మాగ్నటిక్ రెసోనెన్స్) సెంటర్ను సోమవారం ఉదయం ఆచార్య లక్ష్మీకాంతం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె వర్సిటీ పరిశోధనా రంగ విద్యార్థులు, ప్రొఫెసర్లను ఉద్దేశించి మాట్లాడారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రొఫెసర్లు తయారు చేస్తున్న పరిశోధనా పత్రాలు నూతన ఆవిష్కరణలకు ప్రాణం పోస్తున్నాయనీ, భవిష్యత్తులో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అద్భుతాలు సృష్టించడం ఖాయమని కొనియాడారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్కుమార్ ఆరోరా మాట్లాడుతూ, పరిశోధనలకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామనీ, ఇందులో భాగంగానే ఈ నెల 13న రీసెర్చ్ సమ్మేళనాన్ని నిర్వహించనున్నామన్నారు. వర్సిటీ పరిశోధనల పురోగతి కోసం శ్రమిస్తున్న నారాయణరావు, మన్నాథన్, రంజిత్ థాపాలను ఎన్ఎంఆర్గా వీసీ అభివర్ణించారు. యూనివర్సిటీలోని ప్రతి ఒక్క ప్రొఫెసరూ నూతన ఆవిష్కరణల కోసం శ్రమించాలనీ, దృఢ సంకల్పం ఉంటే సాధ్యం కానిది లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ దశాబ్దంలో ఎన్నో జాతీయ పరిశోధనా మిషన్లను ప్రారంభించి గ్రాంట్లు మంజూరు చేస్తుందనీ, వీటి కోసం యూనివర్సిటీ ప్రొఫెసర్లు విస్తృతంగా కృషి చేయాలని నారాయణరావు కోరారు. పరమాణు నిర్మాణంలోని అణువుల శాతాన్ని వాటి స్వచ్ఛతను గుర్తించేందుకు ఎన్ఎంఆర్ మిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని సెంటర్ ఇన్చార్జి డాక్టర్ మన్నాథన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ సలహాదారు ఆచార్య వజ్జా సాంబశివరావు, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమకుమార్, రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా, ఆకడమిక్స్ డీన్ డాక్టర్ వినాయక్ తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జెసి

ప్రజాశక్తి-తాడేపల్లి :సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం తాడేపల్లి మండలంలోని సెక్టారు-5, 6లోని 26 పోలింగ్ కేంద్రాలను మంగళగిరి రిటర్నింగు అధికారి రాజకుమారి గణియా సోమవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాలలో పోలింగు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కనీస సౌకర్యాలైన ఫ్యానులు, లైట్లు, ఫర్నీచర్, తాగునీటి వసతి, టాయిలెట్లలో నీటి సౌకర్యం, గ్రౌండ్ లెవెలింగ్, వృద్ధులు, వికలాంగులకు ఏర్పాటు చేసిన ర్యాంపులను పరిశీలించారు. మిగిలి ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాపై సమగ్ర అవగాహన పెంచుకో వాలన్నారు.

అదనపు కౌంటర్లు, హెల్ప్ డెస్కులు ఏర్పాటు

ప్రజాశక్తి - మంగళగిరి

2024 - 25 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించిన ఏడాది ఆస్తిపన్ను ఏక మొత్తము ఈనెల 30వ తేదీ లోపు ముందస్తు చెల్లింపుపై 5శాతం రాయితీ కల్పించుట జరిగిందని యంటియంసి కమీషనర్ నిర్మల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లించడానికి వీలుగా ప్రతి సచివాలయంలో కౌంటర్లు, యంటియంసి ప్రధాన కార్యాలయం, తాడేపల్లి కార్యాలయం నందు అదనపు కౌంటర్లు, హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్యాష్ కౌంటర్లు ఉదయం 8గంటల నుండి రాత్రి8గంటల వరకు సెలవు రోజుల్లో కూడా పని చేస్తాయని తెలిపారు. పన్ను చెల్లింపు దారులుఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

పట్టణంలో స్వీప్ అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - తెనాలి : సుస్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలంటే ఓటర్లు చైతన్యవంతులై ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలెక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) అవగాహన ర్యాలీ పట్టణంలో నిర్వహించారు. పురపాలక సంఘ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని మెయిన్ రోడ్, గాంధీ చౌక్, బోస్ రోడ్డు మీదుగా సాగింది. ఎడ్ల బండి పై ర్యాలీ నిర్వహిస్తూ అవగాహన కల్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటర్లు చైతన్యవంతులైతేనే మంచి నాయకులను ఎన్నుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ బి అనూష, అసిస్టెంట్ సిటీ ప్లానర్ 2 ఎల్ సుబ్బారావు, వన్ టౌన్ సిఐ దశరథ రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వితరణ

ప్రజాశక్తి - మంగళగిరి

రోడ్డు మార్జిన్లలో చెప్పులు కుట్టడం, చేరుకురసం, కొబ్బరి బోండాలు లాంటివాటిని అమ్మడం లాంటి చిరువ్యాపారులకు వేసవి మండుటెండల నుండి కొంత రక్షణ కల్పించాలానే సంకల్పంతో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి మంగళగిరి వారు స్థానిక నిడమర్రు రోడ్డు లోని అరవింద స్కూల్ గ్రౌండ్‌లో సోమవారం జంబో గొడుగుల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి గుంటూరు జిల్లా శాఖ వైస్ ఛైర్మన్ రామచంద్రరాజు గొడుగుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఇండయన్ రెడ్ క్రాస్ సొసైటి తెనాలి చైర్ పర్సన్ ఎం. భానుమతి, డి.ఎస్.పి మహబూబ్ బాషా , ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి గుంటూరు జిల్లా శాఖ ట్రెజరర్ రవి శ్రీనివాస్, రెడ్ క్రాస్ సొసైటి మంగళగిరి సబ్ బ్రాంచ్ ఛైర్మన్ ఇసునూరి అనిల్ చక్రవర్తి, వైస్ ఛైర్మన్ గాజుల శ్రీనివాస్ రావు, ట్రెజరర్ అందే మురళి పాల్గొన్నారు.

పిఒలు..భయంతో కాకుండా బాధ్యతగా పనిచేయాలి

ఎన్నికల నిర్వహణ అధికారులతో కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రానున్న సార్వత్రిక ఎన్నికలలో పిఒలు (ప్రిసైడింగ్ అధికారులు) భయంతో కాకుండా బాధ్య తతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివ శంకర్ లోతేటి సూచించారు. సోమవారం స్థానిక నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో పిఒలు, ఎఎల్ఎంటి లకు పోలింగ్ సిబ్బందికి శిక్షణకు గాను ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ జరిగే రోజున జాగ్రత్తగా విధులు నిర్వహించాలని, ప్రతికూల పరిస్థితులు ఏమైనా ఎదురైతే చాకచక్యంగా వ్యవహరించి ఎన్నికలు సజావుగా జరి గేలా చూడాలన్నారు. ప్రధాన ఎన్నికల అధికారి సూచనలను ఎప్పటికప్పుడు పాటించాలని తెలిపారు. ప్రిసై డింగ్ అధికారులు విధిగా డైరీలను ఎప్పటి కప్పుడు రాసుకోవాలని తెలిపారు. ఇవి ఎంలలో ఏమైనా సమస్యలు తలెత్తి నట్లయితే వెంటనే పరిష్కరించేలా దానికి సంబంధించిన కమాండ్స్‌పై పూర్తిగా అవ గాహన కలిగి ఉండాలని చెప్పారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ స్టేషన్‌కు చేరు కున్న వెంటనే అక్కడి సదు పాయాలను పరీక్షించాలన్నారు. ముఖ్యంగా క్యూలైన్ మేనేజ్‌మెంట్, ర్యాంపు మంచినీటి వసతి సౌకర్యాలు ఉన్నాయా లేదా గుర్తించాలన్నారు. ఎలక్షన్ కమిషన్ సూచించిన విధంగా ఫోర్ డే మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను జాగ్రత్తగా అమలు పరచాలన్నారు. జెసి ఎ.శ్యాం ప్రసాద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన జాయింట్ కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్


విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి మైనారిటీ నాయకులు

ఓటమి భయంతో వైసిపి నాయకులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఓటమి భయంతో వైసిపి నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారని టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ మాబు విమర్శించారు. సత్తెనపల్లి రఘురాం నగర్‌లోని టిడిపి ప్రజావేదికలో ముస్లిమ్ మైనార్టీ నాయకులు సోమవారం విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు ప్రజాగళం సభ సత్తెనపల్లిలో విజయవంతం కావటంతో వైసిపి నాయకులకు కంటి మీద కునుకు లేకుండా పోయిందన్నారు. ప్రజాగళం సభకు రాజుపాలెం, నకరికల్లు, ముప్పాళ్ళ, మండలాల నుండి వచ్చే వారి కోసం ఈద్గా పక్కన ఉన్న మైదానంలో భోజన ఏర్పాట్లు చేశామని, ప్రశాంత వాతావరణంలో వచ్చిన వారందరు భోజనాలు చేసి వెళ్లారని చెప్పారు. ఈద్గా స్థలంలో ప్రవేశం లేకుండా గేటుకు తాళాలు వేసి పక్కనున్న మైదానంలో అడ్డంగా కర్టన్లు కట్టారని, కాని సభ, భోజనం కార్యక్రమాలు విజయవంతవడాన్ని జీర్ణించుకోలేని కొంతమంది వైసిపికి చెందిన ముస్లిమ్ నాయకులు అర్ధరాత్రి ఈద్గా మైదానంలో మద్యం సీసాలు, గ్లాసులు పడేసి ఆ నెపాన్ని టిడిపిపై మోపుతున్నారని మండిపడ్డారు. ఇమామ్ కూర్చునే దిమ్మెమీద కూడా ఖాళీ సీసాలు, గ్లాసులు పెట్టారంటే వైసిపి వారు ఎంతగా దిగజారారో అర్థమవుతోందన్నారు. ఇలా జనం మధ్య చిచ్చుపెట్టే రాజకీయాలను మంత్రి రాంబాబు మానుకుంటే మంచిదన్నారు. సమావేశంలో నాయకులు సయ్యద్ పెద కరిముల్లా, షేక్ జానీ ఖాజావలి, సయ్యద్ ఖాసీం (రాంబో బుడే) నూర్ బాషా, జాన్‌బాబు, షేక్ చిన్న అబ్దుల్ నబి, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

'నిస్వార్థ సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చానని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొర్రా వెంకట అప్పారావు అన్నారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో బొర్రా అప్పారావు ఆధ్వర్యంలో పాస్టర్లతో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా పాస్టర్ కొత్త సామ్యూల్, పెంకే తిమోతి, కె.సాంబశివరావు, కౌన్సిలర్ ఆర్.సుమన్ ,రూరల్ మండల అధ్యక్షులు ఎన్.నాగేశ్వరరావు, సిహెచ్ పూర్ణ పాల్గొన్నారు.



చర్చ్ ఆఫ్ క్రైస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక చైతన్య నగర్‌లోని వినుకొండ చర్చ్ ఆఫ్ క్రైస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం పేద వితంతువులకు రైల్వే స్టేషన్ వద్ద పేదవారికి అన్న సంతర్పణ నిర్వహించారు. సొసైటీ సిఇఒ ఎండి రాజు చేతుల మీదుగా అన్నం పొట్లాలను అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గం లోని పలు గ్రామాల్లో పేదలకు, వితంతువులకు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పేద విద్యార్థులకు నోట్ బుక్స్ మెటీరియల్స్, హాస్పిటల్స్‌లో ప్రసవ మహిళలకు మెడికల్ కిట్లను త్వరలో అందజేయనున్నట్లు చెప్పారు. కార్య క్రమానికి వినుకొండ చర్చి ఆఫ్ క్రిస్ట్ సభ్యులు ట్రెజరర్ ఎం.రమేష్‌బాబు, సెక్రటరీ ఎం.ప్రవళిక, సభ్యులు ఎన్. బ్రహ్మయ్య, టి.వెంకట కృష్ణ, జి. కిరణ్,జంగాకృష్ణ పాల్గొన్నారు.

ముస్లిములకు అండగా ఉంటాం

ఇఫ్తార్ విందులో మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-నకరికల్లు



ముస్లింలకు వైసిపి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎప్పుడూ అండగా ఉంటారని సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అంబటి రాంబాబు భరోసా ఇచ్చారు. రంజాన్ మాసం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల ముస్లింలు మత పెద్దలు, వైసిపి నాయకులతో దువా చేశారు. అనంతరం నకరికల్లు లోని చైతన్య పాఠశాలలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. జరగబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ముస్లింలను కోరారు. ఇఫ్తార్ విందులో మండల కన్వీనర్ భవనం. రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షులు మేడం ప్రవీణ్ కుమార్ రెడ్డి, హుస్సేన్ బి భాష, పక్కాల సూరిబాబు, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అహంకారం తలకెక్కిన బొల్లా కొమ్ముల్ని ప్రజలే వంచాలి

మత్స్యకారుల ఆత్మీయ సమావేశంలో జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు

ప్రజాశక్తి - వినుకొండ



ఒక్క ఛాన్స్ అన్న మాట నమ్మి ఓటేసిన పేదలందర్నీ ఎమ్మెల్యే బొల్లా నట్టేట ముంచారని, అవినీతి సొమ్ము చూసుకొని అహంకారం తలకెక్కిన ఆయన కొమ్ములు వంచాల్సిన బాధ్యత ఓటర్లపైనే ఉందని టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్ల బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక గంగినేని కళ్యాణ మండపంలో ఫిష్ మార్కెట్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం సోమవారం జరిగింది. జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆంజనేయులు మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రతి ఎస్సీ, ఎస్టీ కాలనీలు, బీసీ, ముస్లిమ్ మైనార్టీ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు వేయించానన్నారు. మక్కెన మల్లికార్జునరావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పారు. తమ హయాంలో వినుకొండకు తాగునీటి పథకం, గ్రామగ్రామానికి సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని పల్నాడు వాటర్ గ్రిడ్ కోసం రూ.640 కోట్లు తెచ్చామన్నారు. వినుకొండ పట్టణ శాశ్వత తాగునీటి పథకం కోసం రూ.159 కోట్లు తెచ్చామన్నారు. కానీ అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు తప్ప మరేం పట్టని ప్రస్తుత ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వాటిని పూర్తి చేయకుండా వదిలేశారని మండిపడ్డారు. నియోజకవర్గంలో ఒక్కరికీ కూడా ఇల్లు గానీ మరుగుదొడ్డి గానీ రాయితీ రుణాలు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. టిడిపి హయాంలో మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేశామని, ఎంతోమందికి వలలు, బైకులు, ఐస్ బాక్సులు, సోలార్ విద్యుత్ దీపాలను ఇచ్చామని చెప్పారు. మరోసారి తమ ప్రభుత్వం వస్తే వేట విరామ సందర్భాల్లో ఆర్థిక సాయం అందేలా చూస్తామన్నారు. గుర్తింపు కార్డులూ ఇస్తామన్నారు. 50 ఏళ్ల దాటిన వారికి నెలకు రూ.4 వేల పింఛను ఇస్తామని చెప్పారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ జీవీ ఆంజనేయులు కచ్చితంగా గెలుస్తారని, బ్రహ్మనాయుడు అహంకారమే జీవీ ఆంజనేయులును గెలిపిస్తుందని చెప్పారు. వరికపూడిశెల ప్రాజెక్టుకు అనుమతులు, రైల్వే అండర్ పాస్ లాంటి ఎన్నో అభివృద్ధి పనులు చేసిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు అండగా నిలుద్దామని చెప్పారు. ఈ సందర్భంగా అతిథులిద్దర్నీ అసోసియేషన్ సభ్యులు సత్కరించారు.

చిరు వ్యాపారులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

చిరు వ్యాపారులకు అండగా ఉంటూ, వారి సమస్యలు పరిష్కరిస్తానని తెలుగుదేశం-జనసేన-బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారం లో భాగంగా సోమవారం సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణ విస్తృతంగా పర్యటించారు. వ్యాపారులతో సమావేశమయ్యారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వ్యాపారులందరూ తాము నష్టపోయామని కన్నా ఎదుట వాపోయారు. తాము అధికారంలోకి రాగానే వ్యాపారం చేసు కోవడానికి అన్ని రకాలుగా సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎ.నాగేశ్వరరావు, పి.వెంకటకోటయ్య, టి.వెంకట్రావు, వసంత రావు పాల్గొన్నారు.


సత్తెనపల్లిలో పర్యటిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ



పలువురు వాలంటీర్లు స్వచ్ఛంద రాజీనామాలు

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని పలువురు వాలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో కీలకంగా ఉన్న వాలంటీర్ వ్యవస్థపై ఎన్నికల కమిషన్, తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీలు విధించిన ఆంక్షలకు నిరసనగా పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్ నగర్, కొత్తపేట సచివాలయానికి చెందిన సుమారు 20 మంది వాలంటీర్లు తమ రాజీనామా పత్రాలను మున్సిపల్ మేనేజర్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ ఇక నుండి ప్రజా సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే రోజుల్లో జగన్, వినుకొండ వైసిపి అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు.



ప్రజాశక్తి - నకరికల్లు

మండలంలోని పలు గ్రామాల వాలంటీర్లు సోమవారం మూకుమ్మడి రాజీనామాలు చేశారు. నకరికల్లు గ్రామ సచివాలయ క్లస్టర్ పరిధిలోని 21 మంది, గుండ్లపల్లి లో 4 గురు, దేచవరంలోని 13 మంది వాలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపిడిఒ జయమణి తెలిపారు. తమ వ్యక్తిగత కారణాలతో రాజీనామాలు చేస్తున్నామని వాలంటీర్లు చెప్పారు.

9 మంది వాలంటీర్ల రాజీనామా ఆమోదం

ప్రజాశక్తి- రెంటచింతల

మండలంలోని మంచికళ్ళు గ్రామానికి చెందిన 9 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు ఈ మేరకు తమ రాజీనామా లేఖలను సోమవారం ఎంపీడీవో శంకరరావుకు అందజేశారు మొబైల్ ఫోన్, సిమ్, డివైస్ అందజేయడం వలన వారి రాజీనామాలను ఆమోదించమన్నారు మండలంలో మొత్తం 269 మంది వాలంటీర్లు ఉన్నారన్నారు..

లావణ్య ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-పెదకూరపాడు



తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ భార్య లావణ్య పెదకూరపాడులో ఇంటింటి ప్రచారం సోమవారం నిర్వహించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు రమేష్, ముంతాజ్, కల్పన, లీలావతి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలను, పిఎఫ్ ను కార్మికుల అకౌంట్లో జమ చేయాలని రాజధాని ఏరియా పారిశుధ్య కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల ఆకలి కేకలను సిఆర్‌డిఎ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అప్పులు ఇచ్చేవారు కూడా లేక కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు జీతాలు అడుగుతుంటే ఎన్నికల కోడ్ అంటూ సూపర్ వైజర్‌లు పొంతన లేని సమాధానాలు చెబుతూ బుకాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల ఓట్లు అయితే కావాలి.. వారి ఆకలి కేకలు మాత్రం నాయకులకు పట్టవా. అని ప్రశ్నించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సూపర్వైజర్లను, అధికారులను ఓట్లు అడిగేందుకు వచ్చిన నాయకులను కార్మికులు, కుటుంబ సభ్యులు నిలదీయాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా కార్మికులకు మంచినీరు, మజ్జిగ ఇవ్వాలని, పనిష్మెంట్‌ల పేరుతో కార్మికులను ఇతర గ్రామాలకు పంపడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాజధాని గ్రామాలలో చెత్తాచెదారం ఊడ్చి, తమ ఆరోగ్యాలను సైతం ఫణంగా పెట్టి ప్రజల ఆరోగ్యం కోసం గ్రామాలను పరిశుభ్రం చేసే పారిశుధ్య కార్మికులకు జీతాలు తక్కువ.. పని భారం ఎక్కువ, గౌరవం తక్కువ-వేధింపులు ఎక్కువన్నారు. మాట మాట్లాడితే పనిలో నుండి తీసేస్తాం..ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ బెదిరింపులకు దిగుతారా.. కార్మికులను బెదిరించి తెల్ల పేపర్ల పై సంతకాలు తీసుకుంటారా.. అని రవి ప్రశ్నించారు. ఏప్రిల్ నెల జరుగుతున్నా ఫిబ్రవరి, మార్చి నెల జీతాలు ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. సక్రమంగా కార్మికుల జీతాలు, పీఎఫ్ చెల్లించాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే మరోసారి ఆందోళన బాట పడతామని ఆ ప్రకటనలో హెచ్చరించారు.

దోమల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి తెనాలి

స్థానిక అయితానగర్ ప్రాంతం జయప్రకాష్ నగర్ లో సోమవారం మలేరియా ఫైలేరియా విభాగం అధికారులు దోమల నియంత్రణ చర్యలపై ఇంటింటికి అవగాహన కల్పించారు. ఇంటింటికి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని చోట్ల ఇంటి ఆవరణలో గుర్తించిన నిల్వ నీటిని తొలగించారు. ఎక్కువగా ఉన్న నీటినిలువలపై ఆయిల్ బాల్స్ చల్లారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, మెదడువాపు, బోదకాలు, జికా వైరస్ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించి, కరపత్రాలను పంపిణీ చేశారు. వైద్య సహాయం కొరకు స్థానిక ఆరోగ్య కార్యకర్తలను గాని ఆశా కార్యకర్తలను గాని సంప్రదించాలని కోరారు. కార్యక్రమాన్ని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె హెలెన్ నిర్మల పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మలేరియా ఫైలేరియా విభాగం సిబ్బంది ఎస్ ఉమాకాంత్, జి. రవికుమార్, ఎ బాలచంద్రమౌళి, డి మల్లేశ్వరరావు, బి మల్లేశ్వరరావు, డి



నిల్వ ఉన్న నీటిపై ఆయిల్ బాల్స్ చల్లుతున్న ఆరోగ్య సిబ్బంది

శ్రీనివాసరావు, షేక్ బాషిద్, షేక్ రషీద్, షేక్ నవీద్, పూజ, నాగమల్లేశ్వరి, సుబ్బారావు, అప్పారావు, వెంకట్రావు పాల్గొన్నారు.

ఓటు హక్కు మన బాధ్యత

ప్రజాశక్తి - తెనాలి



విద్యార్థులతో నాగరాజు

ప్రజాస్వామ్యంలో ఓటు విలువ ఎంతో గొప్పదని దానిని ప్రతి ఒక్కరూ విధిగా ఉపయోగించుకోవాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కోస్తాంధ్ర అధ్యక్షులు పల్నాటి నాగరాజు అన్నారు. స్థానిక శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో సోమవారం తొలి సారిగా ఓటు హక్కు పొందిన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ఓటర్లు చైతన్యవంతులు కావాల్సిన పరిస్థితులపై వివరించారు. గత నెలలో గవర్నమెంట్ హాస్పిటల్లో రక్తదానం చేసిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ నన్నపనేని సునీల్ కుమార్ సర్టిఫికెట్స్ అందించారు.

కసుకర్రులో ఉపాధి హామీ పనులు

రూ.7 కోట్లతో 2 లక్షల 60 వేల పని దినాల లక్ష్యం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్ : కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకం కింద కూలీలకు పని దినాలు కల్పించడానికి లక్ష్యంగా పెట్టుకుందని పొన్నూరు మండల అసిస్టెంట్ కాగిత రత్నరాజు అన్నారు. సోమవారం ఎంఎన్ఆర్ జి ఎస్ పథకం కింద మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలో బోధి కాలు వలో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నరాజు మాట్లాడుతూ 2024- 2025 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం మండలానికి మంజూరు చేసిన రూ. 7కోట్ల నిధులు ద్వారా 2లక్షల 60 వేల పని దినాలను లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రస్తుతం 3 వేల మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నా రన్నారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పించాలని లక్ష్యమన్నారు. వారానికి ఒకసారి బ్యాంకుల ద్వారా వేతనం చెల్లిస్తామన్నారు. ఈ పథకం కింద బ్రాంచ్ కెనాల్సు పూడిక, నీటి గుంతలు, పండ్ల తోటలు అభివృద్ధి, గడ్డి పెంపకం వంటి పనులు చేపడతామన్నారు. ప్రతి కూలికి రోజుకు రూ.300 చొప్పున వేతనం చెల్లిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ఉపాధి హామీ పథకం కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కసుకర్రు ఫీల్డ్ అసిస్టెంట్ దాది నాగమల్లేశ్వరి, మేటు నాగిశెట్టి శ్రీవాణి, ఉపాధి హామీ పథకం కూలీలు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి కృషి

కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-తెనాలి : సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి గెలుపే లక్ష్యంగా ప్రణాళికా బద్దంగా అడుగులు వేస్తామని నాదెండ్ల మనోహర్ అన్నారు . స్థానిక బోస్‌రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం కూటమి పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల సీనియర్ నాయకులు వారి వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మనోహర్ మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కూటమి పార్టీల సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పలు సూచనలు, సలహాలిచ్చారని వాటిని ఖచ్చితంగా పాటిస్తామన్నారు. తాను శాసనసభ్యునిగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని వివరించారు. అలాగే కూటమి అధికారంలోకి రాగానే తెనాలి ప్రణాళికాబద్దమైన అభివృద్ధికి శ్రీకారం చుడతామన్నారు. సమావేశంలో నాయకులు పెండేల వెంకట్రావ్, టి.హరిప్రసాద్, తాడిబోయిన శ్రీనివాసరావు, కోగంటి శివశంకరరావు, హరిదాసు గౌరీ శంకర్, బి.రవికాంత్, జె.మహేష్, డాక్టర్ వి.శేషగిరిరావు, గిరి గణేష్, జి.గోవర్ధనరెడ్డి, ఈదర పూర్ణచంద్ పాల్గొన్నారు.

పొన్నూరులో ధూళిపాళ్ల ప్రచారం




ఓటర్లతో మాట్లాడుతున్న ధూళిపాళ్ల నరేంద్ర

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : పట్టణంలోని 18,19 వార్డులలో టిడిపి కూటమి పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర ప్రచారం చేశారు. పట్నంలో తాగునీటి సమస్య, రోడ్లు, డ్రైన్లు నిర్మాణం, వివిధ కారణాలతో రద్దు చేసిన పింఛన్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ధూళిపాళ్ల, జనసేన నాయకులు మార్కెండేయుబాబులను సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పఠాన్ అహ్మద్ ఖాన్, బండ్లమూడి బాబురావు, బొర్రు రామారావు, మాదాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాతలు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి

సమాజానికి స్ఫూర్తి ప్రదాతలుగా నిలిచిన 20 మందిని ఎంచుకుని పుస్తకాన్ని రచించానని ప్రముఖ సాహితి విమర్శికులు షేక్ అబ్దుల్ రజా హుస్సేన్ తెలిపారు. ఆదివారం రాత్రి మంగళగిరి విటిజెఎం అండ్ ఐవిటిఆర్ డిగ్రీ కళాశాలలో మంగళగిరి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో స్ఫూర్తి ప్రదాతలు పుస్తకాన్ని వర్సిటీ తెలుగు శాఖ విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు ఎం సత్యన్నారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత అబ్దుల్ రజా హుస్సేన్ మాట్లాడుతూ నా జన్మభూమి కన్న ఊరు ఈ రాష్ట్రం ఈ దేశమీ కాదు ఇతర దేశాల్లో కూడా ఎంతోమంది తమవంతుగా సమాజానికి స్ఫూర్తినిచ్చిన 20 మందిని ఎంచుకొని భవిష్యత్ తరాలకు వారి ద్వారా మంచి జరగాలని ఉద్దేశంతో ఈ పుస్తకం తీసుకువచ్చానని అన్నారు. మంగళగిరికి చెందిన ఆరుగురు స్ఫూర్తి దాతలు ఈ పుస్తకంలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి రావి రంగారావు, మంగళగిరి సాహితి కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు,



స్ఫూర్తి ప్రదాతలు పుస్తకావిష్కరణ చేస్తున్న సత్యన్నారాయణ తదితరులు

డాక్టర్ సిహెచ్ సుశీల, కన్వీనర్ రేఖాకృష్ణార్జున్ రావు, ప్రజానాట్యమండలి కళాకారులు కంచర్ల కాశయ్య, ఆంధ్ర నాటకల సమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, ప్రగతిశీల కవి గోలి మధు, కవి గాయకుడు అల్లక తాతారావు, సికే జూనియర్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపల్ మంచా విజయ మోహన్ రావు, కవి రచయిత సందుపట్ల భూపతి తదితరులు పాల్గొన్నారు.



మెల్లంపూడి లో రాజీనామాలను చూపుతున్న వాలంటీర్లు

105 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : వాలంటీర్లు గా విధులు నిర్వహిస్తున్న వాళ్లు సార్వత్రిక ఎన్నికలలో ప్రచారంలో పాల్గొనకూడదనే ఈసీ ఆదేశాలతో ఎంటిఎంసి పరిధిలోని మెల్లంపూడి, ఇప్పటం, పెనుమాక గ్రామాలలో సుమారు 65 మంది వాలంటీర్లు తమ వ్యక్తిగత కారణాలతో వాలంటీర్ల విధులనుండి తప్పుకుంటున్నట్లు సోమవారం రాజీనామాలను గ్రామ సచివాలయ అధికారులకు అందజేశారు. మెల్లెంపూడి లో 12 మంది, ఇప్పటం గ్రామంలో 9 మంది, పెనుమాక గ్రామంలో 44 మంది వాలంటీర్లు తమ రాజీనామా చేశారు.

ప్రజాశక్తి - తుళ్లూరు: 40 మంది వాలంటీర్లు సోమవారం రాజీ నామా చేశారు. మండలంలోని హరిశ్చంద్రపురం, బోరు పాలెం, అబ్బరాజుపాలెం, మందడం గ్రామాలకు చెందిన వాలం టీర్లు ఎంపిడీవో శివన్నారాయణకు రాజీనామా విషయాన్ని తెలిపారు. మండల పరిధిలో 270 మంది వాలంటీర్లు ఉన్నారు. వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా చేశామని వాలంటీర్లు చెప్పారు.



వెంకట్‌ను సత్కరిస్తున్న జాషువా కళా సమితి బృందం

బెల్లంకొండ వెంకట్‌కు కళాభూషణ్ పురస్కారం

ప్రజాశక్తి-తెనాలి : పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు, నటుడు బెల్లం కొండ వెంకట్ కళా భూషణ్ పురస్కారం అందుకున్నారు. దుగ్గి రాలకు చెందిన జాషువా కళాపీఠం ఆదివారం రాత్రి స్థానిక కవి రాజా పార్కు సీనియర్ సిటిజన్స్ భవన్‌లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో భాగంగా వివిధ రంగాల్లో ప్రముఖులను సత్కరిం చింది. దానిలో భాగంగా కళాకారుడు వెంకట్‌కు సత్కరించి, కళాభూషణ్ బిరుదును ప్రదానం చేశారు. అలాగే సాహితీ రంగానికి చేసిన సేవలకుగాను ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయిని షేక్ అస్మదున్నీసాను సాహితీ విద్యారత్న బిరుదుతో సత్కరించారు. కార్యక్రమంలో జాషువా కళాపీఠం అధ్యక్షులు పెద్దిటి యోహాను, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు

శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవాట్రస్ట్ అన్నదానం

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం అమావాస్యను పురస్కరించు కుని శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ దాతల సహకారంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల అమావాస్య ముందు వచ్చే ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు, ప్రతినిధులు కర్నాటి శివ సత్యనారాయణ, నంగళం ప్రసాద్, జూట్రు ఏడుకొండలు, కటారి విష్ణుమూర్తి, డోగిపర్తి శ్రీహరిరావు, ధుంపల సోములు, కగ్గా శ్రీనివాసరావు, అన్నపురెడ్డి రామ కృష్ణారెడ్డి, మన్నెం రమేష్, దామర్ల నాగరాజు, వీరస్వామి, వెంక టేశ్వరరావు, బిక్షారావు, మల్లి, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో న్యాయవాది మృతి

ప్రజాశక్తి - గుంటూరు లీగల్



(లీగల్) శనివారం సాయంత్రం నాగార్జున విశ్వవిద్యాలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో న్యాయవాది నంబూరు కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాద వార్త న్యాయవాదులను దిగ్భ్రాంతికి గురిచేసింది. నంబూరు కోటేశ్వరరావు 2000లో న్యాయవాద వృత్తిలో ప్రవేశించారు. ప్రముఖ సీనియర్ న్యాయవాది దివంగత సిద్ధినేని సత్యనారాయణ వద్ద కొంతకాలం జూనియర్‌గా పని చేశాడు. చుండూరు కేసులో నిందితుల తరపున వాదించిన సిద్ధినేనికి సహాయకునుగా ఉన్నారు. ఆయన మంగళగిరి, గుంటూరు కోర్టులలో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. సోమవారం ఉదయం గుంటూరు కోర్టుకు వచ్చి విధులకు హాజరైన ఆయన తన ద్విచక్ర వాహనంపై సాయంత్రం నాలుగున్నర గంటల ప్రాంతంలో తిరిగి వెళుతూ జాతీయ రహదారిపై యూనివర్సిటీ వద్దకు వెళ్లేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ గుద్దటంతో ఆయన అక్కడికక్కడే మతి చెందారు. కోటేశ్వరరావు మతికి గుంటూరు బార్ అసోసియేషన్ కార్యవర్గం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది.



ఐఎన్‌టిఎస్‌ఓలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్‌లో గుంటూరు జిల్లాలోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని శ్రీచైతన్య స్కూల్స్ ఎజిఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య తెలిపారు. సోమ వారం ఆయా విద్యార్థులను డాక్టర్ అంజయ్య, ఆర్ఐలు జి.అప్పాజీ, సిహెచ్.సురేంద్ర పాల్గొని విజేతలను అభినందించారు. ఎజిఎం అంజయ్య మాట్లాడుతూ శ్రీచైతన్య స్కూల్స్‌లో చదువుతోపాటు అన్ని రంగాలలో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతామన్నారు. ఇటీవల అమెరికా వారు నిర్వహించిన నాసా స్పేస్ సెటిల్మెంట్ కంటెస్ట్‌లో శ్యామలానగర్, గుంటూరు రెసిడెన్షియల్, తెనాలి, బాపట్ల, బ్రాంచిల నుండి ఆరు ప్రాజెక్టులతో శ్రీచైతన్య విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభ ప్రదర్శించారన్నారు. అలాగే ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలంపియాడ్‌లలో గుంటూరు జిల్లా నుండి 5గురు విద్యార్థులు గ్రాండ్ ప్రైజ్‌గా ల్యాప్‌టాప్‌లను, 13 మంది విద్యార్థులు ప్రథమ బహుమతిగా ట్యాబ్‌లను కైవసం చేసుకున్నారన్నారు. అంతేకాకుండా 27 మంది ద్వితీయ, 19 మంది తృతీయ, 66 మంది నాల్గవ, 89 మంది ఐదవ స్థానంలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాల్స్, డీన్‌లు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25) సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా ఏప్రిల్ నెలాఖరులోపు చెల్లించే వారికి మొత్తం పన్నుపై 5శాతం రాయితీ లభిస్తుందని, డిమాండ్ నోటీసుల కోసం వేచి చూడకుండా, కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కులను సంప్రదించి పన్ను చెల్లించి రాయితీని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పన్నును ముందస్తుగా చెల్లించే వారికి 5 శాతం రాయితీ అవకాశాన్ని కల్పిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ నెల 30వ తేదీలోపు ఆస్తి పన్నుని ఏకమొత్తంగా చెల్లిస్తే పన్ను రాయితీ లభిస్తుందన్నారు. జిఎంసి 2024-25 డిమాండ్ మొత్తం ఆన్‌లైన్‌లో పొందుపరచడమైందని, కావున ఆస్తి, ఖాళీ స్థల పన్నుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకొని ఈ నెలాఖరులోపు ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందాలని కమిషనర్ కోరారు. పన్ను చెల్లింపు సమాచారం కోసం ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు సెలవు రోజుల్లో కూడా పని చేసేలా హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. పన్ను చెల్లింపునకు జిఎంసి ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంలో అదనపు క్యాష్‌కౌంటర్లను, భారత్‌పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్డులోని 106, వసంతరాయ పురం మెయిన్‌రోడ్డులోని 148 వార్డు సచివాలయాల్లో కూడా క్యాష్‌కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా లోటస్ ఆద్య పాఠశాల వార్షికోత్సవం



ప్రజాశక్తి-గుంటూరు :స్థానిక కృష్ణనగర్ బ్రాడీపేటలోని బాలానంద కేంద్రం వారి లోటస్ ఆద్యపాఠశాల ఆధ్యాస్ ఆర్మీ కార్ని వాలి-2 పేరుతో జరిపిన వార్షికోత్సవం ఘనంగా నిర్వహిం చారు. చిన్నారులు చిట్టిపొట్టి మాటలు, పాటలు, సాంప్రదాయ, పాశ్చాత్య నత్యాలతో అలరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ సయ్యద్ జవహర్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల క్రితం పూర్వ విద్యార్థిగా తన ఎదుగుదలకు బాలానంద కేంద్రం వేసిన పునాదులు తన ప్రగతికి ఎంతగానో దోహదం చేసిందన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మారుతున్న విద్యార్థుల సమగ్ర విజ్ఞాన, వికాసాన్ని అందివ్వటంలో లోటస్ ఆద్య పాఠశాల చేస్తున్న కషికి తల్లిదండ్రులు ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. పాఠ్యాంశాల బోధనతోపాటు వ్యక్తిగత క్రమశిక్షణతో పాటు మానసిక వికాసం కోసం డ్యాన్స్, డ్రామా, మ్యూజిక్, కళలు, సాంస్కృతిక రంగాలలో ప్రోత్సహించడం ద్వారా వారిలో నాయకత్వ లక్షణాలు అలవాడి సంపూర్ణ విద్యార్థులుగా ఎదుగుతారని చెప్పారు. పాఠశాల కమిటీ అధ్యక్షులు డాక్టర్ మానవ రాధాకష్ణమూర్తి మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఆద్య బాలబాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఒరిస్సా నృత్య కళాకారుల ప్రదర్శన ఆకట్టుకున్నది. కార్యక్రమంలో విద్యావేత్త డాక్టర్ కె.గౌతమి, కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, కార్యదర్శి ఎన్.వి.గురుదత్, సహాయ కార్యదర్శి కె.ఎస్.ఆర్. కుటుంబరావు, కరస్పాండెంట్ పరుచూరి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ యడ్లపల్లి ఉమాదేవి పాల్గొన్నారు.

చెరువులు నింపేందుకు పటిష్ట ప్రణాళిక : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు



జిల్లాలో నాగార్జున సాగర్ కుడికెనాల్, కృష్ణా పశ్చిమ డెల్టా కెనాల్ పరిధిలో ఉన్న తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపేందుకు ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయితీరాజ్, రెవెన్యూ అధికారుల సమన్వయంతో పకడ్బందీ ప్రణాళికతో అవసరమైన చర్యలు తీసుకున్నా మని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డికి తెలిపారు. సోమవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి తాగునీరు, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ కుడి కెనాల్‌కు, కృష్ణా పశ్చిమ డెల్టా కెనాల్‌కు విడుదల చేసిన నీటిని సక్రమంగా తాగునీటి చెరువులు నింపేందుకు గ్రామ, మండల, రెవెన్యూ డివిజన్, జిల్లా స్థాయిలో నిరంతరం పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. గ్రామస్థాయిలో గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయితీ సెక్రెటరీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, లస్కర్లు కెనాల్‌లో సరఫరా అవుతున్న నీటి ద్వారా గ్రామాల్లో తాగునీరు చెరువులు నింపే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. మండల స్థాయిలో తహశీల్దారు, ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరు ఎస్‌హెచ్‌ఓ పర్యవేక్షిస్తారన్నారు. రెవెన్యూ డివిజన్ స్థాయిలో తెనాలి సబ్‌కలెక్టర్, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి నీటి సరఫరా, చెరువులు నింపే ప్రక్రియపై పర్యవేక్షిస్తూ ప్రతిరోజు నివేదికలు అందించటం జరుగుతుందన్నారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్లు వారి సిబ్బంది కెనాల్‌లో నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించటం జరుగుతుం దన్నారు. తాగునీటి చెరువులు నింపే ప్రక్రియ పూర్తి అయ్యేవరకు సంబంధిత శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పనిచేయాలని టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేయటం జరిగిందన్నారు. సమావేశంలో ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్‌ఈ సురేష్, ఇరిగేషన్ ఎస్‌ఈ ఉమామహేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ శ్రీనివాస్, డ్వామా పీడీ పద్మావతి, డీపీఓ శ్రీదేవి, భూగర్భ జలవనరుల శాఖ ఉపసంచాలకులు వందనం, జిఎంసి ఎస్‌ఈ శ్యాం సుందర్, సీపీఓ శేషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌పై సమగ్ర అవగాహన ఉండాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు



ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో పిడబ్ల్యుడి (హోం ఓటింగ్) ఓట్లపై బిఎల్ఓలు, సెక్టార్ అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కీర్తి చేకూరి అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో బిఎల్ఓలు, సూపర్వైజర్లు, సెక్టార్, రూట్ అధికారులతో హోం ఓటింగ్, ఓటింగ్ శాతం పెంపు, ఇతర ఎన్నికల విధులపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నూతనంగా అమలు చేయనున్న పర్సన్ విత్ డిజేబుల్ (హోం ఓటింగ్) పై ప్రతి బిఎల్ఓ, సెక్టార్ అధికారి సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. హోం ఓటింగ్‌కు ఎంపిక చేసిన వారి వివరాలు ఫారం-12డి ద్వారా రిటర్నింగ్ అధికారికి ముందుగానే అందించాలని, ఓటింగ్‌కు సంబంధించి స్థానిక పిఓ, మైక్రో అబ్జర్వర్, మరొక పిఓ, వీడియోగ్రాఫర్ సమక్షంలోనే జరుగుతుందని తెలిపారు. ఎన్నికల విధులు ఒకరికొకరు సమన్వయంతో పనిచేయాలని, సెక్టార్ అధికారులతో సమన్వయం చేసుకోకుండా, ఫోన్ కాల్స్‌కి రెస్పాండ్ అవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదు అందినా సూపర్వైజర్ ఏఈ రవికిరణ్, 150, 248, 74, పోలింగ్ స్టేషన్ల బిఎల్ఓలు ఎం.రామచంద్రరావు, వై.త్యాగరాజు, కె.అనిల్‌కుమార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎన్నికల విభాగం సూపరిండెంట్‌ను ఆదేశించారు. వారం రోజులుగా పెండింగ్‌లో ఉన్న ఫారం-6 క్లైమ్స్‌ను ఎట్టి పరిస్థితుల్లో మంగళవారం సాయంత్రానికి సబ్మిట్ చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బిఎల్ఓలు తమ పరిధిలోని ఓటర్లందరూ ఓటింగ్‌లో పాల్గొనేలా అవగాహన చేపట్టాలని, గత ఎన్నికల్లో పోలింగ్ శాతంకి మించి పోలింగ్ జరిగేలా భాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల్లో ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సెక్టార్ అధికారుల ద్వారా ఇంజినీరింగ్ అధికారులకు తెలియచేయాలని, ఇంజినీరింగ్ అధికారులు స్పదించకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఏఆర్ఓలు ప్రదీప్‌కుమార్, సునీల్, భీమరాజు, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, ఎన్నికల విభాగ సూపరిండెంట్‌పద్మ, మాస్టర్ ట్రైనర్ రవి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో నగర కమిషనర్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ స్లిప్‌లను అందిస్తామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్లకు అందించే ఓటర్ల స్లిప్‌లు రాజకీయ ప్రచారానికి వేదికగా ఉండకూడదని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో, పశ్చిమ నియోజకవర్గ ఆర్ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బిఎల్‌ఓల ద్వారా ప్రతి ఓటరుకు ఓటు స్లిప్ అందిస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎవరైనా ఓటర్ల స్లిప్‌లు ఇవ్వాలి అంటే సదరు స్లిప్‌లో ఏవిధమైన రాజకీయ ప్రచారాలు చేయకూడదని, స్లిప్‌లో రాజకీయ పార్టీల గుర్తులు, రంగులు ఉండకూడదని తెలిపారు. స్లిప్‌లో కేవలం ఓటరు పేరు, పోలింగ్ కేంద్రం పేరు, ఓటర్ల లిస్టులో సీరియల్ నంబర్ ఉండాలని పేర్కొన్నారు. నామినేషన్ ఫారాలను ముందస్తుగా కొన్ని అందిస్తున్నామని, వాటిని సమగ్రంగా పరిశీలించా లన్నారు. నామినేషన్ వేయడానికి ముందే రిటర్నింగ్ అధికారి ఆధీకత సిబ్బందితో చెక్‌లిస్టు మేరకు తగిన పత్రాలు ఉన్నదీ లేనిదీ పరిశీలిన చేయించుకుంటే నామినేషన్ రిజెక్ట్ కాకుండా ఉంటుందన్నారు.సమావేశంలో ఏఆర్ఓలు సునీల్, భీమరాజు, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, ఎన్నికల విభాగ సూపరిండెంట్ పద్మ, కె.దివాకర్‌రెడ్డి, వైసిపి నుండి పి.అనిల్‌కుమార్, టిడిపి నుండి ఓంకార్, బిఎస్పీ నుండి సిహెచ్.వాసు, బిజెపి నుండి పాండురంగ విఠల్, ఆప్ నుండి సేవాకుమార్, కాంగ్రెస్ నుండి జానీభాష సిపియం నుండి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



పూలే,అంబేద్కర్ విగ్రహాలకు ముసుగులు తొలగించాలి

ఎన్నికల కమిషనర్‌కు బిసి సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల కోడ్ నిబంధనలను అమలు చేసే క్రమంలో సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబాపూలే, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాలకు కూడా వేసిన ముసుగులు తొలగించాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. ఈ మేరకు బిసి సంక్షేమ సంఘం నాయకులు సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల కోడ్‌లోగా భాగంగా జాతీయ, రాష్ట్ర నాయకుల విగ్రహాలకు గుడ్డతో చుట్టటం చేస్తున్నారని, కానీ ఆ క్రమంలో జ్యోతిబాపూలే, అంబేద్కర్ విగ్రహాలకు కూడా ముసుగులు వేయటం సరికాదన్నారు. వారి విగ్రహాలకు ఉన్న ముసుగులు తొలగించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, యువజన ప్రధాన కార్యదర్శి కె.హనుమంతరావు, రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు జి.ద్వారకశ్రీను తదితరులు పాల్గొన్నారు.